నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 05 మార్చి 2025 | www.navatelangana.com

అంగన్వాడీల అరెస్టులను ఖండించండి

అరెస్టు అయిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలి
సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్, జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి : పెండింగ్ వేతనాలు అమలు చేయాలని ప్రజాదర్బార్ ప్రజావా ణిలో వినతిపత్రాలు ఇవ్వడానికి వెళ్తుండగా.. ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, సాయిలు మండిపడ్డారు. ఈ అరెస్టులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్వాడీల ఏరియాస్ వేతనాలను విడుదల చేయాలని,పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రజాదర్బార్ హైదరాబాదులోని ప్రజావాణిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న మినీ అంగన్వాడీలను, సీఐటీయూ నాయ కులను ప్రభుత్వం అరెస్టులు చేయించడం సరికాదన్నారు. అంగన్వాడీల పైన నిర్బంధ కాండను ఆపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ నిర్బంధ పాలనకు తెరతీస్తోందన్నారు. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీలను అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలను సహించేదిలేదు

నవతెలంగాణ-అమీన్‌పూర్



మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించబోమని అమీన్ పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిచ ంద్ర ప్రసాద్ హెచ్చరించారు. అమీ న్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సర్వే నెంబర్ 673లో అక్రమంగా నిర్మిం చిన పలు నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ మరియు రెవిన్యూ ఆదికారుల ఆదేశాలతో జేసీబీల సాయంతో మంగళవారం నేలమట్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ల పొట్టలు నింపే
కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిద్దాం

- కార్మిక, ప్రజా అనుకూల సవరణలపై పోరాడుదాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ టౌన్

భారత ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన 2025-26 సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో కార్పొరేట్లకు ప్రయోజనాలు కల్పించి, సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు విమర్శించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పన్నులు మాత్రం పేద ప్రజల దగ్గర వసూలు చేస్తూ, లాభాలు మాత్రం కార్పొరేట్లకు చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రజలకు కొనుగోలు శక్తి బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవన్నారు. ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు అరకొరగా కేటాయించిందన్నారు. దేశ ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న స్కీమ్ వర్కర్లకు ఎలాంటి అదనపు ప్రయోజనాలు కల్పించకపోగా, గతంలో కేటాయించిన నిధులను కూడా కుదించడం దారుణమన్నారు. తాము అధికారంలో రావడానికి ఎన్నికల బాండ్లు ఇచ్చి సహాయపడింది కార్పొరేట్లేనని, కార్పొరేట్ల ప్రయోజనాలకే పెద్ద పీట వేసేందుకు మోడీ కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణకు నిధులు తేవడంలో విఫలమయ్యా రన్నారు. బీజేపీ తన మతోన్మాద వైఖరిని ముందుకు తీసుకుపోయే విధంగా కార్మికులపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. కార్మికుల కనీస వేతనాలు పెంచే విధానంలో మొండి వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు నిధులు ఇచ్చే విషయంలో చేస్తున్న అన్యాయాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా నిర్లక్ష్య ధోరణి వహిస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని బడ్జెట్‌పై నిధులు రాబట్టడం కోసం పోరాటం చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు గడుస్తున్నప్పటికీ, అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలులో పూర్తిగా విఫలమవుతుందన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 జాడే లేదన్నారు. కళ్యాణ లక్ష్మితో పాటు, తులం బంగారం ఇస్తామన్న హామీ మర్చిపోయా రన్నారు. ఏడవ గారంటీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోజు హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులపై ఉక్కు పాదం మోపడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ రోజు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గానీ, సామాజిక ఆర్థిక సర్వే విషయంలోగాని, పద్ధతుల్లోనే కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. ప్రజా కార్మిక రైతు సవరణలను బడ్జెట్‌లో చేర్చే వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టే విధంగా సీపీఎం కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరింకల మల్లేశం, బాలమణి, జిల్లా కమిటీ సభ్యులు గౌరీ, అజయ్, భాగయ్య నవీన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి క్యాంప్ ఆఫీస్ వేదిక

- సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళండి
- అభివృద్ధి కోసం గ్రామాల వివరాలు సేకరించండి
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా గెలిచిన తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ తనదైన మార్కు చూపుతున్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో అభివృద్ధి వేగంగా పరుగులు పెడుతుండగా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో రోజు మొత్తం మండలాల వారీగా ప్రత్యేక సమయాన్ని కేటాయించి వారికి ఉన్న వ్యక్తిగత సమస్యలు ఆయా గ్రామాలు, మండలాల వారీగా ఉన్న సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ వినతులు స్వీకరించారు. అక్కడే పలు అంశాలతో అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం చేశారు. మరిన్ని సమస్యలపై పరిష్కారానికి మార్గాలు చూపుతూ తానున్నంటూ భరోసానిచ్చారు. ప్రధానంగా సమస్యల్లో తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, చదువుకున్న యువకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, సాగునీరు అందించడమే తమ ప్రథమ కర్తవ్యంగా నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పంపిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మెగా జాబ్ మేళా ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే గతంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా ద్వారా 5 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించామన్నారు. వేసవి కాలం ప్రారంభమైందని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు ఇటు గ్రామశాఖ అధ్యక్షులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న పార్టీ ముఖ్య నేతలకు పలు అంశాలపై సూచించారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, తమ కార్యాలయంలో నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ వేగంగా జరుగుతుందన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఇంకా గ్రామాల్లో రోడ్లు అవసరం ఉన్నాయా అని ఆరా తీశారు. పలు గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాల్‌లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను మంత్రి వద్దకు తీసుకొచ్చారు. గ్రామాల్లో పాత కొత్త నేతలు సమన్వయం చేసుకొని పని చేయాలని పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి అవకాశాలు వస్తాయని సూచించారు. గ్రామాల్లో ప్రజల చేత నేతలు మంచి పేరు తెచ్చుకోవాలని, గ్రామాల్లో పార్టీ మరింత బలోపేతం దిశగా తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా అన్ని మండల అధ్యక్షులు గ్రామ శాఖ అధ్యక్షులు అనుబంధ సంఘాల నేతలు పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు 5శాతం కేటాయించాలి

- ఉపాధి హామీలో జాబ్‌కార్డ్స్ జారీ చేసి.. 150 రోజులు పని కల్పించాలి
- సమస్యల పరిష్కారానికి 17న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య



నవతెలంగాణ-సంగారెడ్డి

ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు 5శాతం కేటాయించాలని, ఉపాధి హామీలో జాబ్‌కార్డ్స్ జారీ చేసి 150 రోజులు పని కల్పించాలని ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యల పరిష్కారానికి ఈనెల 17న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం కేవల్ కిషన్ భవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు యం.బస్వరాజు పాటిల్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, లబ్ధిదారులు ఎంపికలో వికలాంగులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి హామీలో వికలాంగులకు 150 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో వికలాంగులతో శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయివేట్ పరిశ్రమల్లో అర్హత కలిగిన వికలాంగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ రూ.6000లకు పెంచి వెంటనే అమలు చేయాలన్నారు. కొత్త పెన్షన్స్ మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నద న్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగులకు తీవ్ర అన్యాయం చేసింద న్నారు. వికలాంగుల సంక్షేమ పథకాలకు నిధుల కోత విధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ లో పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.మాణిక్ మాట్లాడుతూ.. వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వికలాంగులకు ఎందుకు కేటాయించడం లేదన్నారు. జిల్లాలో వికలాంగులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వికలాంగులను కించపరుస్తూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్పీఆర్డీ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సాయమ్మ, జిల్లా కార్యదర్శి కొనింటి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు జయలక్ష్మి, రాజు కుమార్, రాంచందర్, శోభారాణి, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, బిస్మిల్లా, శంకర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు కృపాకర్,చెన్నరెడ్డి, రాములు, కృష్ణ, సుధాకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలుకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్



నవతెలంగాణ-సంగారెడ్డి

కనీస వేతనం అమలు కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టబోతున్నామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్ అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ సీఐటీయూ ఆఫీసులో జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. కార్మికులు కష్టపడి పనిచేస్తున్నా రాష్ట్ర వ్యా ప్తంగా కోటి 20 లక్షల మందికి నేటికీ కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. పాలకులు ధరలు పెంచుత న్నారు తప్పా.. కార్మికుని వేతనం సౌకర్యాల కోసం ఆలో చించడం లేదన్నారు. గత ప్రభుత్వం 10 ఏండ్లు కనీస వేతనం అమలు చేయకుండా సమావేశాలకి పరిమితం అయ్యి ందని.. ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల కోసం ఆలోచిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు కనీస వేతనాల కోసం ఆలోచించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ కనీస వేతన సలహా మండలిలో అన్ని కార్మిక సం ఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అను కూలంగా వ్యవహరిస్తుందని కార్మికులు సాధించుకున్న హక్కులను తగ్గించి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిం ర్ణయాలు తీసుకుంటుందన్నారు. పెట్టుబడిదారులకు అను కూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మికునికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఇతర సౌకర్యాలు కల్పించాలని ఈ నెల ఒకటి నుండి ఏడు వరకు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపియన్ నడుస్తుందని ప్రతి కార్మికుని కలిసి చైతన్యం చేసి తమ హక్కుల కోసం కనీస వేతనం కోసం ఉద్యమించాలని పిలుపుని చ్చా రు. ప్రభుత్వం కనీస వేతనం కోసం ఆలోచించకుంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కనీస వేతనం ఇవ్వాలని ఇతర సౌకర్యాలు పరిష్కరించాలని ఈనెల 7న రాష్ట్రవ్యా ప్తంగా అన్ని కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐ టీ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్, జి. సాయిలు, నాయ కులు రాజయ్య, పాండురంగారెడ్డి, రాజిరెడ్డి, మైపాల్, యాద గిరి, ప్రవీణ్, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో స్థానానికి వెళ్లి ఇద్దరు మృతి



నవతెలంగాణ-న్యాల్‌కల్

చెరువలో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు పొరపాటున నీటమునిగి మృతి చెందారు. ఈ ఘటన న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చెరువు వద్ద మంగళవారం జరిగింది. హద్నూర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన సంజయ్ కామెడే (50), ఫయీం (17)లు ఆరోగ్య సమస్యలతో గంగ్వార్ వద్ద ముల్తాని బాబా దర్గాను దర్శించు కునేందుకు వచ్చారు. ఈ క్రమంలో దర్గా సమీపంలోని గంగ్వార్ చెరువు వద్దకు స్థానానికి వెళ్లారు. కాగా వారికి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీట ముని గి ఇద్దరు మృతి చెందారు. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై చల్ల రాజశేఖర్ పరిశీలించారు. ఒకరి మృతదేహాన్ని వెలికి తీయగా.. మరొకరి మృతదేహం కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదం భార్యాభర్తలు మృతి



నవతెలంగాణ-వట్ పల్లి

161 జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి దాదాపు 8.30 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. పోలీసులు ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా అల్లాదుర్గంకు చెందిన బండ సాయిలు(55) అతని భార్య మానెమ్మలు టేక్మల్ మండలంలోని బొడ్మాట్ పల్లి సంతలో కూరగాయలు విక్రయించేందుకు వెళ్లారు. అక్కడ సంతను ముగించుకొని తిరుగు ప్రయాణంలో చిల్వేరా బొడ్మాట్ పల్లి హైవే బ్రిడ్జి మీద రాంగ్ రూట్లో వస్తున్న కారు బైకును ఢీకొట్టడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు మృతదేహాలను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు

రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు
లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

అర్హులైన రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ వెంటనే చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లప ల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంక్‌లో మంజూరైనా రుణమాఫీ కూడా రావటం లేదన్నారు. జిల్లాలో సుమారు 600 మందికి.. గ్రామీణ బ్యాంక్ పేరు మారటంతో రుణమాఫీ కాలేదన్నారు. వాటిని వెంటనే పూర్తి చేసి రుణమాఫీ అమలు చేయాలని కోరారు. లేని యెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, జైపాల్ రెడ్డి, బసప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డ్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరవధిక నిరసనలు 28వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం రోజున ఆటో యూనియన్ సభ్యులు నిరసనలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నిరసనల్లో పాల్గొన్న నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల ప్రజలు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్‌ను నిరసిస్తూ సామరస్యంగా నిరవధిక సమ్మెలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని మండిపడ్డారు. దాంతో జేఏసీ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే.. డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంటనే కలెక్టర్ రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో స్వయంపాలనా దినోత్సవాలు దినోత్సవం





నవతెలంగాణ- జోగిపేట

జోగిపేట జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్ గా ఏ.గణేష్, డీఈవోగా ఏ.జ్ఞానేశ్వర్, ఎంఈఓగా డి.రాజేష్, హెచ్ఎంగా ఎండి.ఇర్ఫాన్, ఉపాధ్యాయులుగా డి. దుర్గాప్రసాద్, వివేక్, శివ కేశవ్, మనోజ్, అజమ్, పండరి, అఖిల్, నితిన్, కృష్ణ ప్రసాద్, విగ్నేశ్వర్, ఎన్సిసి ఆఫీసర్‌గా రామచందర్, వ్యాయామ ఉపాధ్యాయులుగా సిహెచ్. అఖిల్, వివేక్, రికార్డు అసిస్టెంట్ గా నిఖిల్ రెడ్డి, అటెండర్లుగా కే.లక్ష్మణ్, రామ్, టీ.నిఖిల్ వ్యవహరించారు. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ కుమార్, సీనియర్ ఉపాధ్యా యులు ఆకుల మానయ్య, నరోత్తం, త్రినాధ్, మంజ్యా నాయక్, అనిల్, చంద్రశేఖర్, రాములు, హైమద్, శ్రీను, సుభద్రాంగి దేవి, అమృత,వీరీక్షణ, మంజులవిద్యార్థులను అభినందించారు.

మునిపల్లి : మండలంలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరిపాం ం. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. జిల్లా విద్యాధికారిగా ఉమన్, మండల విద్యాధికారిగా వెంకటేష్, ఉపాధ్యాయులుగా హర్షిత, మహాలక్ష్మి, సాహితి, స్పందన, అంజలి, సోఫియా, ప్రభు, గౌతమ్, రమేష్, గిరివన్, సాయిలు, వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి భీంసింగ్, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు నాగభూషణం ముఖ్య అతిథులుగా హాజరుకాగా స్థానిక ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉపాధ్యాయులు సిద్దేశ్వర్, మోహిని తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో చురుకుగా ఉండాలి


నవతెలంగాణ-కంది



హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఉన్నత భరత్ అభియాన్ ఇనిషియేటివ్(యుబిఎ) ఆధ్వర్యంలో మండలంలోని వడ్డెనగుడ తండా, కంది తండా, ఎర్దానూర్ తండా, ఇప్పలగడ్డా తండా గ్రామాల్లో కమ్యూనిటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సామాజిక బాధ్యత, గ్రామీణాభివృద్ధికి నిబద్ధతను పునరుద్ఘాటించారు. నిర్వహించారు. దాదాపు 35 మంది విద్యార్థులు, 8 మంది అధ్యాపక సభ్యుల అంకితమైన బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. వృద్ధుల్లో ఆరోగ్యక రమైన మరియు మరింత స్థిరమైన జీవనశైలి పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రవర్తనా మార్పు గురించి అవగాహన కల్పించారు. కాగా రెండు గ్రామాల్లోని పాఠశాలలకు క్యారం బోర్డు, క్రికెట్ బ్యాట్, బాల్, బ్యాడ్మింటన్ సెట్, హులా హూప్, ఫుట్ బాల్‌తో సహా ఆటలు, క్రీడా పరికరాలను విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుబడ్డ విటుడు



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్ పల్లి గ్రామ శివారులో బాలరాజు యశోద ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటి యజమానురాలితో పాటు ఒకవిటుడు, ఒక మహిళను టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం సమయంలో బాలరాజు యశోద తన ఇంటిలో వేరే ఆడవారిని తీసుకొని వచ్చి వ్యభిచారం చేయిస్తుందన్న నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. విటుడు మోతే శేఖర్(21), ఒక మహిళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1700 లు, 03 కండోమ్స్, 3 సెల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలు, ఇరువురిని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన చేస్తున్నారని టాస్కోఫర్స్ పోలీసులు తెలిపారు.

ప్రజాపాలనంటే అక్రమ అరెస్టులా?

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

నాలుగు వేల మంది అంగన్వాడీ టీచర్లకు 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని.. వారికి హెల్పర్స్‌ను వెంటనే నియమించాలని కోరుతూ హైదరాబాద్ వెళ్తున్న నాయకులను అరెస్టు చేశారని.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులా? అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మండిపడ్డారు. ఉదయం 5 గంటల నుంచే సీఐటీయూ నాయకుల, అంగన్వాడీల ఇంటికి వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం చాలా దారుణమన్నారు. ఇలా అరెస్టులు చేయడం వల్లనే కేసీఆర్ ఇంట్లో కూర్చున్నాడని.. అదే గతి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా అక్రమంగా అరెస్టయినా మినీ అంగన్వాడి టీచర్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా 4 వేల మంది మినీ అంగన్వాడీ టీచర్లను 2024 జనవరి 1 నుండి మెయిన్ అంగన్వాడీ టీచర్స్‌గా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వారికి నిరాశే మిగిల్చిందన్నారు. వారికి గత 9 నెలల వేతనాలు పాత పద్ధతిలో సగమే చెల్లించారన్నారు. పూర్తి వేతనం రాకపోవడం, హెల్పర్ లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించానలి కోరుతూ హైదరా బాద్‌కి వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్లో పెట్టడం చాలా దారుణమన్నారు.అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి భీంసింగ్ హాజరయ్యారు. గంధం సరస్వతీ ఫౌండేషన్ ద్వారా వారి కుమారుడు గంధం మల్లికార్జున్ 10వ తరగతి విద్యార్థులకు రైటింగ్ పాడ్స్, పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లడుతూ.. 20 రోజుల్లో జరిగే వార్షిక పరీక్షల్లో కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలను అధిష్టించాలని కోరారు. గంధం సరస్వతీ ఫౌండేషన్ ద్వారా మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన మల్లికార్జున్‌ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు కల్పన, ఉష్రశ్రీ, శ్రీవిద్య, స్వరూప రాణి, ఆంజనేయులు, శైలజ, సుభాష్ రావు, కరుణాకర్ రెడ్డి, రమేష్, జూనియర్ అసిస్టెంట్ పాషా, అష్రాఫ్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ ఖాతాదారులు కేవైసీ వివరాలు అందజేయాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈపీఎఫ్ ఖాతాదారులు తమ కేవైసీ వివరాలు అందజేయాలని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ ఖాతాదారులకు విజ్ఞప్తి చేశారు. ఈపీఎఫ్ ఖాతాదారులు (మరియు ప్రావిడెంట్ ఫండ్ మరియు ఇతర నిబంధనల చట్టం-1952 పరిధిలో వున్న సంస్థల యజమానులు) ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేని ఈపి ఎఫ్ సేవలు పొందడం కోసం వారి యుఎన్ఏకి తమ కెవైసి వివరాలు (ఆధార్, బ్యాంక్ ఖాతా మరియు పాన్) అప్డేట్ /సీడ్ చేయాలని మరియు ఈ-నామినేషన్ కూడా అందజేయాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి నరోత్తం పరామర్శ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మల్గి గ్రామానికి చెందిన మల్‌రెడ్డి ఇటీవలే కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం మంగళవారం మృతుడు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి తండ్రి, మాజీ సర్పంచ్ భూమారెడ్డికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు నాయకులు మల్లయస్వామి, శివరాజ్ తదితరులు ఉన్నారు.

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందన్నారు. దరఖాస్తుదారులకు నేరుగా మొబైల్ ద్వారా ఫీజు డీటెయిల్స్ వస్తాయన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి భవన నిర్మాణ అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టినవాళ్ళు, లేఔట్ యాజమానులు సైతం ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. సందేహాల నివృత్తికి అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా పదో తరగతి వీడ్కోలు.. వార్షిక సమావేశం



నవతెలంగాణ-సంగారెడ్డి

మండలంలోని కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు.. వార్షిక సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉతీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు, గ్రామానికి, మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. కాగా విద్యార్థులు చేపట్టిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, విరాజ్ రెడ్డి, వీణకుమారి, కమల్ జీత్ కౌర్,శైలజ, అఫిస్ సిబ్బంది హామీద, ప్రవీణ్, రాహుల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎస్ఎంఎల్ కాలనీ క్వార్టర్స్‌లో పిచ్చిమొక్కల తొలగింపు



నవతెలంగాణ-సదాశివపేట

పీఎస్ఎంఎల్ కాలనీలోని క్వార్టర్స్‌లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను 9వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జి మఠం వీరన్న స్వామి తొలగింపజేశారు. పచ్చి మొక్కల వల్ల విష పురుగులు, పాములు ఇండ్లల్లోకి వస్తున్నాయని వార్డు ప్రజలు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి.. ట్రాక్టర్ డోజర్ ద్వారా చెట్లను మరియు పిచ్చి మొక్కలను మంగళవారం తొలగింపజేశారు. ఈ సందర్భంగావీరన్న స్వామి మాట్లాడుతూ.. తమ వార్డు ప్రజలు కాలనీకి సంబంధించిన ఎలాంటి సమస్యలైనా తీర్చడంలో ముందు ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో బండి రాజు, శేఖర్, వీరిశెట్టి, రవీందర్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో బోర్లు వేయించిన ప్రసాద్‌రెడ్డి



నవతెలంగాణ-కోహిర్

ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బంది పడొద్దని మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో కే.ప్రసాద్‌రెడ్డి తన సొంత డబ్బుతో రెండు తాగునీటి బోర్లను మంగళవారం వేయించారు. గ్రామంలో మంచినీటి సమస్య ఉన్నదని తెలియగానే.. వెంటనే స్పందించి బోర్లు వేయించారు. దాంతో సజ్జాపూర్ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్ రాథోడ్, అశోక్, సజ్జాపూర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా ఆస్మా తబస్సు



నవతెలంగాణ-జహీరాబాద్

కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా ఆస్మా తబస్సును నియమిస్తూ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆస్మా తబస్సు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలుకి జిల్లా అధ్యక్షురాలు సుధాకి, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చంద్రశేఖర్‌కి, ఎంపీ సురేష్ షెట్కర్‌కి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో పదవి అప్పగించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టినట్టు హద్నూర్ పంచాయతీ సెక్రటరీ ధనరాజ్ అన్నారు. హద్నూర్ గ్రామ పంచాయతీకి సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల కోసం మొదటి విడత 464, రెండో విడత 66 ఇండ్లకు ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితాను మంగళవారం ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ చదివి వినిపించారు.

మేళాసంఘం పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా స్వాతి, డీఈఓగా సాయి, మండల విద్యాధికారిగా వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా యాశ్మీన్, ఉపాధ్యాయులుగా సందీప్, కార్తీక్, భానుప్రసాద్, సీ.హెచ్ సందీప్, ఉపాధ్యాయురాలుగా భార్గవి, కీర్తన, అంజలి, శ్రావణి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ హాజరై.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా చేసిన బోధనను పరిశీలించి అభినంది ంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ మేడం బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వీరన్న, భానుప్రకాశ్, మోహన్ బాబు, శ్రీకాంత్ ఉపాధ్యాయురాలు ఉషారాణి, నిరూప రాణి, ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల ప్రోత్సాహానికి మూర్తి

గీతంలో మరో ముందడుగు..



- ఔషధ ఆవిష్కరణలో పురోగతి
- జాతీయ సైన్స్ దినోత్సవం రోజున శ్రీకారం
- పరిశోధనా సంస్కృతికి పెద్దపీట

నవతెలంగాణ-పటాన్‌చెరు

పరివర్తనాత్మక పరిశోధన సంస్కృతిని పెంపొందించే దిశగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గణనీయమైన ముందడుగు వేసింది. గీతం ప్రాంగణాలన్నింటిలో మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి -అనువాద చొరవలపై బహుళ విభాగ పరిశోధనా విభాగం)లను ఏర్పాటు చేసింది. జాతీయ సైన్స్ దినోత్సవం రోజున గీతం హైదరాబాద్‌లో శ్రీకారం చుట్టుకున్న ఈ చొరవ వివిధ రంగాలకు చెందిన పరిశోధకుల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, సాంప్రదాయ విద్యా సరిహద్దులను అధిగమించే సంక్లిష్ట సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చూపేలా రూపొందిం చారు. శాస్త్రీయ విచారణను పెంపొందించడానికి, కొత్త ఆలోచనలను పెంపొందించడానికి గీతం యొక్క అంకితభావానికి నిదర్శనం ఈ మూర్తి పరిశోధనా కేంద్రం. గీతం హైదరాబాద్ ల్యాబ్ అత్యాధునిక శాస్త్రీయ పరిశోధనలో ముందంజలో ఉంది. మూడు ప్రధాన పరిశోధనా బృందాలు (ఔషధ రసాయన శాస్త్రం, జీవశాస్త్ర పరిశోధన, మెటీరియల్ సైన్స్) పరివర్తనాత్మక ప్రాజెక్టులలో చురుకుగా నిమగ్నమై ఉన్నాయి.

ఔషధ ఆవిష్కరణలో పురోగతి..

కొత్త చికిత్సా పరిష్కారాలను అభివృద్ధి చేసే ప్రయత్నాలకు మెడిసినల్ కెమిస్ట్రీ పరిశోధనా బృందం నాయకత్వం వహిస్తోంది. డెంగ్యూకి సమర్థవంతమైన చికిత్సలను అందించే లక్ష్యంతో,డెంగ్యూ ఆర్‌డీఆర్‌పీ ఎంజైమ్‌ను లక్ష్య ంగా చేసుకుని సంభావ్య నాన్-న్యూక్లియోసైడ్ లీడ్‌లుగా ఆక్సిండోల్-5-సల్ఫొనామైడ్ ఆధారిత సమ్మేళనాలను ఆప్టి మైజ్ చేయడం ఆ బృంద ప్రాథమిక చర్యల్లో ఒకటి. ఈ సం చలనాత్మక పరిశోధనలో క్యాన్సర్ నిరోధక ఏజెంట్లు, యా ంటిజెన్ లక్ష్యంగా ఉన్న క్యాన్సర్ చికిత్సల అభివృద్ధి కూడా ఉంది. ఇది తదుపరితరం ఆంకాలజీ చికిత్సలకు మార్గం సుగమం చేస్తోంది.

హోస్ట్-పాథోజెన్ పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం - పరిష్కారాలు

అంటువ్యాధుల సంక్లిష్టతలను వెలికితీసేందుకు జీవశాస్త్ర పరిశోధన బృందాన్ని ఏర్పాటు చేశారు. క్షయ, మలేరియా పరాన్న జీవులలో హోస్ట్-పాథోజెన్ పరస్పర చర్యలను ఒక కీలక ప్రాజెక్ట్ పరిశీలిస్తోంది. వ్యాధి విధానాలపై మన అవగాహనను మెరుగు పరచడం, వినూత్న చికిత్సా వ్యూహాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా, ఈ బృందం రోగ నిరోధక విధానాలలో విప్లవాత్మక మార్పులు చేయగల లక్ష్య వ్యాక్సిన్ డెలివరీ వ్యవస్థలను అన్వేషిస్తోంది. వ్యవసాయం, ఆహార భద్రతలో క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించడం, మొక్కల రక్షణ కోసం నానోపెర్టిలైజర్లు, యాంటీ ఫంగ్ ఏజెంట్లను అభివృద్ధి చేస్తోంది. అధునాతన మెటీరియల్స్ లో ఆవిష్కరణలు వివిధ శాస్త్రీయ, పారిశ్రామిక డొమైన్ లలో సంభావ్య అనువర్తనాలతో కొత్త పదార్థాలపై పరిశోధనలో మెటీరియల్ సైన్స్ బృందం మార్గదర్శకంగా ఉంది. అధునాతన పదార్థాలను అభివృద్ధి చేయడంపై వారి దృష్టి నిలిపి, శక్తి నిల్వ, నానోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్ వంటి రంగాలను మారుస్తుందని, అధిక పనితీరు గల పదార్థాలకు పరిష్కాలను చూపుతుందని విశ్వసిస్తున్నారు. మూర్తి ద్వారా.. గీతం బేసిక్ సైన్స్, వాస్తవ-ప్రపంచ అనువర్తనాల మధ్య అంతరాన్ని తగ్గించే ప్రభావవంతమైన పరిశోధనలను చేపట్టడమే కాకుండా, పరిశోధనలో సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెబుతోంది. జాతీయ విద్యావిధానం-2020కి అనుగుణంగా, గీతం విద్యార్థులను పరిశోధనలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. కొత్త తరం సమస్య పరిష్కారాలను, ఆలోచనాపరులను ప్రోత్సహిస్తోంది. మూర్తి ప్రారంభంతో, కేవలం పరిశోధన మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టడం కాకుండా, ఆవిష్కరణల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.



విద్యాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులవ్వాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

విద్యాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులవ్వాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సతీమణి పట్లోళ్ల అనుపమ రెడ్డి పిలుపునిచ్చారు. విద్యతోనే ప్రతి వ్యక్తి నిర్మాణం జరుగు తుందని ఆ విద్యను అందించే విద్యాలయాల కోసం విద్యార్థుల విద్యా సామాగ్రి, మౌలిక వసతుల సమాజంలోని దాతలు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. నారాయణఖేడ్‌లోని జెడ్పిజిహెచ్ఎస్ విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీలు, జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు అట్లాస్ బుక్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి విద్యా వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పాఠశాలలో మౌలిక వసతులతో పాటు ఆయా ప్రభుత్వ పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్ విద్యను అందజేస్తున్నారన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అదేవిధంగా విద్యార్థుల ఉన్నతి కోసం దాతలు మరింత సహకరించాల న్నారు. తనవంతుగా విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీలు, అట్లాస్ బుక్స్ ను అందించడం ఆనందంగా ఉందన్నారు. రాబోవు రోజులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీజీపెచ్‌ఎం లు మన్మథ కిషోర్, యాదవ రెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రావు సభ్యులు చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సదాశివపేట

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల ప్రకారం మహాత్మా జ్యోతి బాపూలే, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలన్నారు. అందరూ క్రమశిక్షణగా ఉండాలన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని ఉపాధ్యాయులకు సూచించారు. మహిళా సాధికరత కోసం మహిళా దినోత్సవ కార్యక్రమాలు జరుపు తున్నామని.. అందులో భాగంగా ఈ న్యాయ అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహా యం అందిస్తామన్నారు. ఏదైనా న్యాయ సహాయం కావా లంటే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యా ల యాన్ని సంప్రదించా లన్నారు. అనంతరం అక్కడ విద్యా ర్థులకు అందించే ఆహార నాణ్యత ఎలా ఉందో తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట సబ్ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యం



నవతెలంగాణ-సదాశివపేట

సమాజ సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తున్నాయని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ్ పిలాని అన్నారు. సదాశివపేట పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ నూతన శాఖను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ మోయినాబాద్ ప్రధాన కార్యదర్శి డింపుల్ అగర్వాల్, అధ్యక్షుడు చిరంజీవి సలూజ, డిస్టిక్ గవర్నర్ ఉదయ్ పిలాని, రాంప్రసాద్, శరత్ చౌదరి, రాజశేఖర్ హాజరయ్యారు. అనంతరం రోటరీ క్లబ్ సదాశివపేట శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సదాశివపేట రోటరీ క్లబ్ అధ్యక్షనిగా ప్రభు, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్ కుమార్, మెంబర్షిప్ షేర్ చీల మల్లన్న, ఫౌండేషన్ చైర్ వినోద్ కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్ డాక్టర్ చంద్రశేఖర్, సభ్యులుగా రాజకుమారి ముద్ర, పురం రాజీని, శరత్చంద్ర, అన్నపూర్ణ, రాజు, నరేందర్, నాగరాజు, డాక్టర్ మాలతి లత, డాక్టర్ రామకృష్ణ, కృపాకర్, రామకృష్ణారెడ్డి, రచన్నలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఉదయ్ పిల్లాని మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థలో ఒకటి అన్నారు. ఇతరులకు సేవను అందించడం, సమగ్రతను ప్రోత్సహించడమనే ఈ క్లబ్ లక్ష్యమన్నారు. గతంలో మొయినాబాద్ బ్రాంచ్ రోటరీ క్లబ్ ద్వారా సరస్వతి శిశు మందిర్ పాఠశాల లో మూడు లక్షలతో మరుగుదొడ్లను నిర్మించి ప్రారంభించామన్నారు. రోటరీ క్లబ్ సదాశివపేట ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ పాంశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రోటరీ క్లబ్ ఇలాంటి మరెన్నో స్వచ్ఛంద సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.

పెద్దాపూర్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలోని పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సదాశివపేట ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ నాగేందర్ కంప్యూటర్ ల్యాబ్‌ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలనే సదుద్దేశంతో ఎస్బిఐ వారు తమ పాఠశాలకు కంప్యూటర్లను అందించడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. అందుకు సహకరించిన బ్యాంకు మేనేజర్‌కు పాఠశాల విద్యార్థుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ నాగేందర్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచంలోని ప్రతీ రంగంలో కంప్యూటర్లు ప్రత్యేక పాత్రను పోషిస్తున్నాయన్నారు. ప్రతీ విద్యార్థి కంప్యూటర్‌లోని మెలుకువలను నేర్చుకొని తమ ఉజ్వల భవిష్యత్తుని నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్బిఐ బ్యాంకులో విద్యార్థులకు మాత్రమే కల్పించే 'పెహలీ కదమ్' మరియు 'పెహలీ ఉడాన్' పథకాల గురించి వివరించి ప్రతి విద్యార్థి సేవింగ్ అకౌంట్ ని కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు పెంచాలి



నవతెలంగాణ-కంది

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి.. ఉపాధి హామీకి రెండు లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని ఉత్తర్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనిప్రదేశం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పర్యటించి.. కూలీల ఇబ్బందులను తెల్సుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నర్సిములు మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులను తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. ఈయేడు బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.84 వేల కోట్లు మాత్రమే కేటాయించారని..అందులో పాత బకాయిలే రూ.13వేల కోట్లు ఉన్నాయన్నారు. కాబట్టి ఆ బడ్జెట్‌ను సవరించి ఉపాధి హామీకి రెండు లక్షల కోట్లు కేటాయిస్తే తప్పా ప్రజలకు ఉపాధి అందే పరిస్థితి లేదన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకువచ్చి ఫోటోలు వస్తే తప్ప పేమెంట్ చేయము వంటి సిస్టం రద్దు చేయాలని, వర్క్ ఐడి 500 మీటర్ల దూరంలోనే ఫోటోలు వస్తున్నాయని కచ్చితంగా మళ్ళీ ఫోటో కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఉపాధి హామీలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రామచందర్,మల్లమ్మ, స్వరూప, అనిల్ గ్రామ కూలీలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్తయ్య, దశరథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డీపీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య, దశరథ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీ పరిధిలో గ్రామ పంచాయతీ సిబ్బందినితీసుకురావాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు క్యాటగిరిల వారీగా చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 51ని సవరించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్‌లు కల్పించాలని.. చనిపోయినా, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాల సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కరించుకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పోచయ్య, మల్లయ్య, ప్రవీణు, రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. తప్పని తాగునీటి కష్టాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవికాలం ప్రారంభంలోనే గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతున్నది. రేజింతల్ గ్రామంలో మంచినీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మంచినీటి బోర్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా మర్మతులు చేపట్టలేదు. దాంతో వేసవి ప్రారంభంలోనే రేజింతల్‌లో నీటి ఎద్దడి మొదలైంది. తాగునీటి కోసం బిందెలు పట్టుకుని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీటి పాట్లు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ సెక్రెటరీ వివరణ కోరగా.. నిధుల కొరత ఉందని.. అందువల్లే బోర్లు మరమ్మతులు చేయలేకపోయామన్నారు.

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని చాలా రోడ్లు గుంతలు పడి ప్రయాణ సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆ రోడ్లన్నింటికి వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సిములు డిమాండ్ చేశారు. పార్టీ కొండాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు రాత్రుళ్లు సైతం విధులకు వెళ్తుంటారన్నారు. అయితే రోడ్లన్ని గుంతలు పడి ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కార్మికులందరికీ కనీస సౌకర్యాలైన ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ఓటీ డబల్ లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలన్నారు. రెండు లక్షల రుణ మాఫీ జరగకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని.. రైతు భరోసా రాని వారికి వెంటనే అమలు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో 200 పని దినాలు కల్పించాలని.. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. వేసవికాలం దృష్ట్యా పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు పనిప్రదేశంలో మరణిస్తే పది లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే. రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, నరసింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్,ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యహరించి తోటి విద్యార్థులకు బోధించారు. డీఈవోగా జి. ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలిగా కావేరి, రమాదేవి, ఉపాధ్యా యులుగా వంశీ, రాజు విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా బోధించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ లక్ష్మీ, భాస్కర్, మోహన్ రెడ్డి, రవీందర్, మల్లేశం,సూర్యారావు,ఎలీషా, విజయఅరు ణ, చంద్రశేఖర్,లలితాదేవి,సిఆర్‌పిఅంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని పరీక్షా కేంద్రాల్లో ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటిరోజు తెలుగు సబ్జెక్టుకు సంబంధించి న్యాల్‌కల్ కాలేజీలో 405 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. హద్నూర్ పోలీసుల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో గట్టి భద్రత మధ్య పరీక్షలు జరగనున్నాయి.

నవ తెలంగాణ
మెదక్
3
బుధవారం | 05 మార్చి 2025 | www.navatelangana.com

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-కొల్చారం

మండల కేంద్రం కొల్చారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలుసూచనలు చేశారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఫ్యాన్లు, వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది పరీక్షలు ముగిసే వరకు అందుబాటులోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గఫార్, ఆర్ఐ ప్రభాకర్ సిబ్బంది ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఏవో శ్వేత కుమారి



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని రంగంపేట గ్రామంలోని శ్రీ లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టాకు రిజిష్టర్లను, నిల్వలను పరిశీలించారు. వ్యవ సాయాధికారి శ్వేత కుమారి మాట్లాడుతూ కొనుగోలు చేసిన రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోపాటు రశీదులను వెంటనే అందజేయాలని దుకాణదారులను ఆదేశించారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి బియ్యం అందజేత

నవతెలంగాణ-చేగుంట

మండల కేంద్రానికి చెందిన చాకలి మణెమ్మ యాదగిరిల కూతురు సౌజన్య వివాహం కోసం ప్రముఖ సంఘ సేవకులు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ అయిత పరం జ్యోతి మంగళవారం వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం, చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో అయిత సంధ్యారాణి పరంజ్యోతి, సొసైటీ డైరెక్టర్ రఘురాములు, రేఖంధర్ బాబురావు, మాజీ వార్డ్ మెంబర్ కట్టా శ్రీనివాస్, అయిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నను గొంతు పిసికి చంపి ఆత్మహత్యగా చిత్రీకరణ

- చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

సొంత అన్నను గొంతు పిసికి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటన మాసాయిపేట మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన దుంపల చందు, దుంపల మహేష్ అను ఇద్దరు అన్నదమ్ములు ఒక ఇంట్ల సొంత అన్నదమ్ములు నివసిస్తున్నారు. వీరి తల్లిదండ్రులు గతంలోని చనిపోయినట్టు తెలిపారు. వీరిద్దరికీ పెళ్లిళ్ల కూడా జరిగి కొన్నాళ్లలోనే భార్యలు వీరి ప్రవర్తనను బట్టి వెళ్ళిపోయి వేరే వద్ద ఉంటున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి వీరిద్దరూ ఒకే ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. రోజువారీ లాగే సాయంత్రం కూరగాయలు తేవడానికి తమ్ముడు చందు వెళ్లి మద్యం తాగి ఇంటికి లేటుగా రావడంతో కోపానికి గురై బూతు మాటలు తిట్టడం కొనసాగిస్తుండగా చందు ఆవేశానికి తట్టుకోలేక పోయాడు. కోపంతో అన్నను చంపేస్తే తానొక్కడినే ఇంట్లో ఉండొచ్చు అనే క్షణిక ఆవేశంతో అన్న మహేష్ గొంతు పిసికి చంపివేసి వైరు మెడకు చుట్టి ఉరి వేసుకున్నట్లు చిత్రీకంచే యత్నం చేశాడని ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి హుండీని మంగళ వారం లెక్కించినట్లు ఈవో విశ్వనాథ శర్మ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా బుగ్గ రాజేశ్వర స్వామి, దేవాలయం కార్య నిర్వహణ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, ధర్మకర్త ల మండలి, కోటిలింగాల సేవా సమితి సభ్యులు, అర్చక మరియు సిబ్బంది ఇతర దేవాలయాల సిబ్బంది వారి సమక్షంలో హుండీని లెక్కించినట్లు ఆయన తెలిపారు. హుండీ ఆదాయం రూ॥79,844లు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దూల్మిట ఎస్బిఐ బ్యాంకు లో జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సీపీ 509 సీడ్ మొక్కజొన్నతో రైతులకు అధిక దిగుబడి

- వెంకటాపూర్‌లో సీపీ సీడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన
- ఏరియా మేనేజర్ బైతి పర్శరాములు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

సీపీ 509 సీడ్ మొక్కజొన్నతో రైతులకు అధిక దిగుబడి ఆదాయం పొందవచ్చని సీపీ ఏరియా మేనేజర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో విష్ణు పొలంలో సీపీ 509 మొక్కజొన్న సీడ్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీ 509 రకం వలన సీడులో వ్యాధులు తట్టుకునే సామర్థ్యం ఎక్కువ ఉంటుందన్నారు. అదేవిధంగా నాణ్యత బరువు వాతావరణం తట్టుకునే శక్తి సామర్థ్యం కలిగిన కొత్త రకం అని తెలిపారు. రైతులు సీపీ సీడ్ మొక్కజొన్న పంట వేసి ఎక్కువ ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి స్థానిక సమస్యలు



నవతెలంగాణ-చిన్నకోడూరు

మండలంలో నెలకొన్న పలు సమస్యలను రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు అజ్జు యాదవ్ తెలిపారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని మంత్రి కార్యలయంలో మంత్రి పొన్నంను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో నెలకొన్న సమస్యలను విన్నవించినట్టు అజ్జు యాదవ్ తెలిపారు.


ఎల్లమ్మ బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ బోనాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి దర్శించుకు న్నారు. అనంతరం కలయ కమిటీ సభ్యు లు ఎమ్మెల్యేను శాలువ కప్పి సన్మానిం చారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి




నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్టు సూపరిండెంట్ సుమన్ రాజా కళ్యాణ్ తెలిపారు. మంగళవారం పరీక్ష కేంద్రంలో నిర్వహణ ఏర్పాట్లను సూపరిండెంట్ సుమన్ రాజా కల్యాణ్, పరీక్షల అధికారి వెంకటరమణ పరిశీలించారు. ఉదయం 9 గం.వరకు పరీక్ష కేంద్రంలో అనుమతిస్తారని విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాలని అధికారులు తెలిపారు. కళాశాల సిబ్బంది శివ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం స్వపరి పాలన దినోత్సవం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం నాగపురి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 37 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని కొన్ని తరాలను విద్యావంతులుగా తీర్చిదిద్దగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి,పద్మ నిరుపమ, విజయ్ కుమార్ మనోజ్,ప్రకాష్ రెడ్డి, మాదవి, యాదగిరి, స్వర్ణ కుమార్, కనకలింగం, రాజేశ్వరి, ఫహీం సుల్తానా, ఉమర్, స్వామి పాల్గొన్నారు.



ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులా...?

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి.
- మినీ అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని మండిపాటు
- అరెస్టులపై ఉన్న శ్రద్ధ సమస్యలపై ఎందుకు లేదని ప్రశ్న



నవతెలంగాణ-శివ్వంపేట

రాష్ట్రంలో గడీల పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని ఉదరగొట్టే ఉపన్యాసాలు ఇచ్చే ఉపన్యాసాలు ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను సమస్యలు పరిష్కరించమంటే పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయించడమా ప్రజాపాలననా అని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి అన్నారు. మినీ నుంచి మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా మారిన 4 వేల మంది అంగన్వాడీ మినీ టీచర్లకు పెంచిన 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే అందివ్వాలని, అంగన్వాడీలలో ఆయాలను నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ వెళ్తున్న సీఐటీయూ నాయకులను, అంగన్వాడీ టీచర్లను అక్రమంగా అరెస్టు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. వేకువజామున 5 గంటలకు అంగన్వాడీల ఇంటికి వెళ్లి డోర్లు కొట్టి అక్రమ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ధారుణమని ఆయన మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ప్రభుత్వం ఆపలేదని, అక్రమ అరెస్టులు చేయడంతోనే కేసీఆర్ ఓటమి పాలయ్యాడని, కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందని ఆయన జోష్యం పలికారు. జిల్లావ్యాప్తంగా అక్రమంగా అరెస్టయినా మినీ అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని, మినీ అంగన్వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరితా, సుగుణ, ఉన్నారు.

వరస దొంగతనాలకు చెక్

- ఎస్పీ ఉదయ్ కుమార్



నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల్లో వరస దొంగతనాలకు పాల్పడుతూ మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 3న రాత్రి పూట ఏడుపాయల దేవస్థానం పరిసరాలలో పాపన్నపేట పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ ఆటోలో అనుమానాస్పదంగా కూర్చున్న కొందరు వ్యక్తులను గమనించారు. వెంటనే నిందితులు పారిపోవడానికి యత్నించగా వెంటనే పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించారు. నిందితులు ఏడుపాయల దేవస్థానం పరిసరాలలో భక్తులు నిద్రిస్తున్న సమయంలో సత్రాలలోకి వెళ్లి బంగారు ఆభరణాలు దొంగిలించామని తెలిపారు. దీంతో పాపన్నపేట పోలీసులు వారిని అరెస్టు చేసి ఐదు దొంగతనం కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి మొత్తం కలిపి 12.1 గ్రాములున్న ఐదు బంగారు మంగళ సూత్రాలను, చోరీలో ఉపయోగించిన ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఈ కేసులో అరెస్టయిన నిందితులలో అందరూ సంగారెడ్డి రూరల్, హత్నూర, కౌడిపల్లి, కుల్చారం, శంకరం పేట, అల్లాదుర్గ్, కొండాపూర్, పుల్కల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. కేసును విజయవంతంగా ఛేదించినందుకు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సీసీఎస్, ఐటీ సెల్ పోలీసు బృందానికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలియజేశారు. ప్రజల భద్రతే తమ లక్ష్యమని, ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏడుపాయల దేవస్థానం వద్ద ఇటువంటి చోరీలు పునరావృతం కాకుండా స్థానికులు అనుమానితులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇస్తే దోపిడీలు తగ్గుతాయన్నారు. ప్రజల సహకారంతో, అన్ని సకల సమన్వయంతో ఏడుపాయల జాతరను విజయవంతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సీసీఎస్ బృందం, ఐటీ సెల్ బృందం తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యువపార్లమెంట్ -2025 నోడల్ జిల్లాగా మెదక్

- యువత వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోండి
- ప్రిన్సిపల్ డా కె. హుస్సేన్

నవతెలంగాణ-మెదక్ టౌన్

వికసిత్ భారత్ యువపార్లమెంట్ -2025 నోడల్ జిల్లాగా రాష్ట్రంలో నోడల్ జిల్లాగా మెదక్ ఎంపికయిందని, దీని పరిధిలో మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలు వస్తాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. ఈ జిల్లాలోని యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దేశంలో యువత, ఆలోచన విధానాన్ని, అభిప్రాయాలను పాలసీ విధానంలో పొందుపరచి, ప్రపంచంలోనే భారత్‌ను అత్యంత శక్తి వంతమైనా దేశంగా తీర్చి దిద్దేందుకు, ప్రతిష్టాత్మకంగా భారత యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిని జాతీయస్థాయికి (పార్లమెంట్) పంపించడం జరుగుతుందన్నారు. యువ పార్లమెంట్ ఫెస్టివల్‌లో పాల్గొన దలచిన వారు గూగుల్‌లో మై భారత్ పోర్టల్‌లో మెగా ఈవెంట్‌ను క్లిక్ చేయడం ద్వారా నమోదు కావచ్చని తెలిపారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ గురించి ఏమనుకుంటున్నారనే అంశంపై ఒక నిమిషం వీడియో తీసి రిజిస్ట్రేషన్ అయ్యాక అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యక్రమం మార్చి 9వ తారీకు వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎం.రంజిత్ రెడ్డి, కార్యక్రమ అధికారులు డాక్టర్ ఆర్.శ్రీలత, కే.వెంకటేశ్వర్లు, వి.మురళి, జి.కిరణ్‌లు పాల్గొన్నారు. మిగితా వివరాలకు 9885077541, 9985372264, 9912787070 సంప్రదించాలని తెలిపారు.

చాకరిమెట్ల ఆలయ హుండీ లెక్కింపు

- 5నెలలకు రూ.5.75 లక్షల ఆదాయం



నవతెలంగాణ-శివ్వంపేట

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కుల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ, ధర్మదాయ శాఖ జిల్లా ఇన్స్ పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో ఆలయ ఫౌండర్ చైర్మన్ భాస్కరరాయని ఆంజనేయ శర్మ, ఈఓ సారా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 5 నెలలకు సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించగా 5 లక్షల 75 వేల 8 వందల 76 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. రాజరాజేశ్వరి సేవా సమితి భక్తుల సంపూర్ణ సహకారంతో, గ్రామస్తుల సహాయంతో హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ ఆదాయాన్ని ఆలయం పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు బాలమణి నరేందర్, హంస హర్యానాయక్, నారాయణ రావు, ఆలయ సిబ్బంది నర్సింహా రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ







నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్‌లో "స్వపరిపాలన" దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా అవతారమెత్తి తరగతులకు వెళ్లి పాఠాలు బోధించారు. విద్యార్థులందరూ చాలా చక్కగా క్రమశిక్షణతో సమయపాలన పాటించి తమ విధులను నిర్వర్తించారు. తరగతి గదిలో పాఠాలు వినే తాము ఈ రోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు చెప్పడం వల్ల తమకు కలిగిన అనుభూతి మరువలేనిదని విద్యార్థులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రోజు టీచర్లు పాఠాలు చెబితే విద్యార్థుల అల్లరి వల్ల కలిగే అసౌకర్యాన్ని ఈ సందర్భంగా తాము ప్రత్యక్షంగా తెలుసుకున్నామన్నారు. భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తామన్నారు. ప్రతిభ చూపిన ఉపాధ్యాయ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సల్లారపు పద్మా రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. హెచ్ఎంగా మదీహ, డిఈవోగా రామ్ చరణ్, ఎంఈఓగా శశి కుమార్ వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా నాహేద, రాణా, సాదిక్ నరేందర్, రోహిత్ అరవింద్, రహీమ్, అజయ్, జీశాన్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్ సుకన్య, నరేష్ చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని చండి గ్రామంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలను బోధించారు. స్వయం పాలనతో ఉపాధ్యాయులు ప్రతి రోజు ఎదుర్కునే సమస్యలు ప్రత్యక్షంగా మేము అనుభవించామని విద్యార్థులు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు అందరు మంచి మార్కులు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు స్వయం పరిపాలనలో డిఈఓగా రాజేష్, ఎంఈఓగా ప్రవీణ్, ఎచ్ఎంగా నరేందర్, మరికొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ఎచ్ఎం సురేందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దయానంద్ రెడ్డి, వెంకటరామరావు, అరుణ, వర్గంటి సంతోష్ కుమార్ గౌరీ శంకరశర్మ పర్యవేక్షించారు. స్వయం పాలన దినోత్సవంతో చెంది పాఠశాల ప్రాంగణమంతా ఒక పండగ వాతావరణంలోకి వెళ్ళిపోయింది.

నవతెలంగాణ-టేక్మాల్

విద్యార్థిని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా రాణించాలనే ఉద్దేశ్యంతో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి సుజాత అన్నారు. మండల పరిధిలోని బొడ్మట్ పల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సుజాత, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వప్న మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను స్వయంగా విద్యార్థులు తెలుసుకుంటారని బోధన అనుభవం అనేది విద్యార్థులకు ప్రాథమిక తరగతులలోనే కలగాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావం ఏర్పడాలని ఎంఈఓ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌గా అఖిల, జిల్లా విద్యాధికారిగా ప్రణీత్, మండల విద్యాధికారిగా హర్షిత, ప్రధానోపాధ్యాయురాలుగా స్పందన, ఉపాధ్యాయులుగా స్రవంతి, అనురాధ, సింధూజ, దుర్గాభవాని, పూజ, మానుష, హరిక, స్వప్న, అనసుజ, అక్షర, అభిలాష్, మోహన్, సుధాకర్, విఘ్నేష్, భాస్కర్, దుర్గా ప్రసాద్, రంజిత్ కుమార్, శ్రీనివాస్, శ్రీశాంత్, శివ, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ కొటంగారి యాదమ్మ పాఠశాల ఉపాధ్యాయులు, లత, అశోక్, నాగరాణి, దశరథ్, కృష్ణ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుగా ధ్రువన్, కలెక్టర్‌గా శివకుమార్, డిప్యూటీ కలెక్టర్‌గా సాయి మనీష్, డీఇఓగా వరుణ్, ఎంపీడీవోగా ఆసిఫ్, ఎంఈఓగా అక్షయ, ఉపాధ్యాయులుగా సాదియా, సూర్య కళ, ఇందు శ్రీ భావన, భార్గవి, భవాని, విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రఘుపతి, రాజేశ్వర్ సుధాకర్ రెడ్డి, సురేందర్, చల్లా లక్ష్మణ్, మనోహర్ రావు, వెంకటేష్, శారద, రాధా, రమా, రమాదేవి, రేఖా, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న బుకింగ్ ఆదాయం రూ.59 లక్షలు

- ఏడో వారం నిరుడి కన్నా రూ. 23, లక్షలు పెరిగిన ఆదాయం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఏడో వారానికి మూడు రోజుల బుకింగ్ ఆదాయం రూ.59,20,661లు వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఏడో వారానికి, శనివారం రూ.4,06,131లు ఆదివారం రూ 48,09,992 లు, సోమవారం రూ 07,04,538 లు బుకింగ్ ఆదాయం వచ్చిందని తెలిపారు. భక్తులు స్వామివారికి భక్తులు వివిధ రకాల మొక్కుబడులు 1, దర్శనాలు, లడ్డు ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వార ఈ ఆదాయం సమాకూరినట్లు తెలిపారు. గత సంవత్సరం ఏడో వారంకు రూ.36,13367లు రాగ ఈ ఏడు గత సంవ త్సరం కంటే రూ 23,07,294లు అధికంగా ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

అసమర్ధ కాంగ్రెస్ పాలనలో రైతులకు సాగునీటి కష్టాలు

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ దాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

అసమర్ధ కాంగ్రెస్ పాలనతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతులకు కేసీఆర్ అండగా నిలబడి జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను నిర్మించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటూ రైతులకు సాగునీరు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలు తీసుకుంటుందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీరు అందించామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎండాకాలం రాకముందే ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నేతలు పదవుల కోసం కుమ్ములాడుకుంటూ నియోజవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఘాటుగా విమర్శించారు. పంటలు ఎండిపోక ముందే రైతులకు సాగునీరు అందించాలని కోరారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు.

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గజ్వేల్

టీఎన్జీవో గజ్వేల్ టీఎన్జీవో భవనం యందు బి.లింగం టీఎన్జీవో గజ్వేల్ అధ్యక్షతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా టిఎన్జీవో కార్యదర్శి విక్రం రెడ్డి, సహాధ్యక్షులు నిమ్మ సురేందర్, ఫోరం అధ్యక్షులు నగేష్, పవన్, సత్యనారాయణ ఎన్జీవో గజ్వేల్, ఉద్యోగస్తుల సమక్షంలో 2025 క్యాలెండర్ ఆవిరిష్కరణ చేశారు. అదేవిధంగా ముందస్తు అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా మహిళ ఉద్యోగస్తులను సన్మానించారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజశేఖర్, సహా ధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ కోశాధికారి ప్రవీణ్, యూనిట్ సభ్యులు మహిళా ఉద్యోగులు గజ్వేల్ తాలూకా ఉద్యో గస్తులు పాల్గొన్నారు.



హమాలీ సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకిచ్చిన హామీ ప్రకారం హమాలీ సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం)మండల కార్య దర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం)పార్టీ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ప్రజా జీవనంలో కార్మికులు కీలకమని వారి సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఐ(ఎం)పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శాఖ కార్యదర్శి సంగ ఎల్లయ్య,బొమ్మిడి సాయికృష్ణ,కుంట సత్తయ్య,గాజె రాజు, గాజె లక్ష్మణ్ , ఇంగె నర్సింగం,తాటి చెట్టు రాజమల్లు,నిషాని నాగరాజు పాల్గొన్నారు.



అక్రమ అరెస్టులు దుర్మార్గం

- సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్



నవతెలంగాణ-దుబ్బాక

ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్వాడీల వేతనాలను విడుదల చేయాలని, పెరిగిన నూతన వేతనాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని ప్రజాభవన్ కు తరలి వెళుతున్న దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి, తోగుట, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పలువురు మినీ అంగన్వాడీ టీచర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ తీవ్రంగా ఖండించారు. మినీ అంగన్వాడీలతో పాటు మెయిన్ అంగన్వాడీ టీచర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ, నిర్బంధ పాలనకు తెరతీస్తోందని, పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించేదానిపైన ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి మినీ అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల లేదని విమర్శించారు. అంగన్వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వారి వెంట అంగన్వాడీ టీచర్లు దీన, అనురాధ, మమత, కనకతార పలువురున్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశిస్సులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వ్రాసే సిద్దిపేట జిల్లా విద్యార్థిని, విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని, మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి, మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానని, మీ మంచి భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి, వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

వరిలో అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతి

- జిల్లా వ్యవసాయ అధికారి రాధిక



నవతెలంగాణ-కొమురవెల్లి

వరిలో అగ్గి తెగులు కాండం తొలిచేపురు ఉధృతి అధికంగా ఉందని నివారణకు రైతులు నత్రజని ఎరువులు వాడకం తాత్కాలికంగా నిలిపివేసి సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక సూచించారు. సిద్దిపేట జిల్లాలో కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మతో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్గి తెగులు సోగిన వరి ఆకులపై కండే ఆకారంలో ఎర్రటి మచ్చ ఏర్పడి క్రమంగా ముదురు గోధుమ రంగులోకి మారి ఆకులు ఎండిపోతాయని పేర్కొన్నారు. దీని నివారణకు రైతులు నత్రజని (యూరియా) ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా ఆపివేయాలని కోరారు. వెంటనే ట్రై సైక్లోజోన్ మందును 0.6 గ్రా. లేదా కాసుగా మైసిన్ మందును 1.5 మి.లీ. లేదా ఐసోప్రో తయోలిన్ 1.5మి.లి. చొప్పున లీటరు నీటికి కలిపి రెండుసార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. అగ్గి తెగులు ఆకుమచ్చ దశలో నివారించకపోతే దాని తర్వాత దశలో మెడవిరుపు అధికంగా ఆశించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని నివారణకు ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ ం టేబ్యుకొనజోల్ 80 గ్రా. లేదా అజాక్సిస్ట్రోబిన్ 16.7శాతం, ట్రైసైక్లోజోల్ 33.3 యస్ పి 200 మి. లీ. లేదా పికాక్సిస్ట్రోబిన్ ం ట్రైసైక్లోజోల్ 400 మి. లీ. ఎకరానికి పిచికారి చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు ముందస్తుగానే చిరు పొట్ట దశలో ఎకరానికి కార్టప్ హైడ్రో క్లోరైడ్ 50%యస్ పి 400 గ్రా. లేదా క్లోరంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా ఐసో సైక్లోసిరమ్ 120 మి.లీ. పిచికారి చేయాలన్నారు. ఒకసారి తెల్లకంకులు ఏర్పడిన తర్వాత ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేసిన ప్రయోజనం ఉండదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రమ్య, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న హర్యానా గవర్నర్



నవతెలంగాణ-కొమురవెల్లి

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కలిసి దర్శించుకున్నారు. ఎంపీ రఘునందన్ రావు ఆయన వెంట ఉన్నారు. అంతకుముందే జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ, గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ వేరువేరుగా పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అలాగే ప్రభుత్వ లాంఛనాల ప్రకారం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ముఖ మండపంలో ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజనేయులు, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ అధికారులు, తదితరులు ఉన్నారు.

డబుల్ ఇండ్ల ఖాళీ స్థలాన్ని పరిశీలించిన ఎంఆర్ఓ



నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు కోసం ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మద్దూరు తహసీల్దార్ ఏజీ రహీం హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సాయ పల్లి గ్రామంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఖాళీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాళీ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని గ్రామానికి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఖాళీ స్థలాన్ని సందర్శించినట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఖాళీ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

హరీశ్ రావుకు సుదర్శనచక్ర శిఖర ప్రతిష్ట ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో గల సీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఈనెల 7, 8,9,10వ తేదీల్లో జరిగే వార్షికోత్సవం సందర్భంగా 9వ తేదీన సుదర్శన చక్ర శిఖర ప్రతిష్ట కార్యక్రమ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావుకు మంగళవారం అందజేశారు. అందజేసిన వారిలో తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్, ఆలయ వ్యవస్థాపకులు యస్.హనుమంతరావు తదితరులున్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-కొండపాక

అనారోగ్య సమస్యలతో పాటు భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ పంచాయతీ పరిధిలోని సేలంపు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుముల రమేష్ (35) ప్లంబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. అలాగే భార్య కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కలత చెందిన ఆయన జీవితంపై విరక్తి చెందిన ఆయన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్టు ఆయనను వివరించారు.

అక్రమంగా డంపు చేసిన ఇసుక స్వాధీనం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా డంపు చేసిన 30 టన్నుల ఇసుకను టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రేగులపల్లి పద్మారెడ్డి వ్యవసాయ పొలం వద్ద దండుగుల కనకయ్య అనే వ్యక్తి ఇసుకను అక్రమంగా డంపు చేశాడు. ఎలాంటి అనుమతులు లేకుండా డంపు చేయడంతో నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు



నవతెలంగాణ-గజ్వేల్

పేదలకు సంక్షేమ ఫలాలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు జంగం రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్లో ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నమన్నారు. నూతన రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో 20 స్థానాల్లో గెలుపొందిస్తుందని ఆయన చెప్పారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-నంగునూరు

ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు గోవిందారం రవి సూచించారు. నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మంచి భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.

పేదలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలి

- గజ్వేల్ మున్సిపాలిటీ సీఓ సరిత



నవతెలంగాణ-గజ్వేల్

పేదలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలి. స్వయం ఉపాధి పొందెందుకు శ్రీనిధి, డాక్రా గ్రూపులో ద్వారా వారిని ప్రోత్సహిస్తున్నాం. అంటూ గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీల సీఓ సరితతో నవతెలంగాణ ముఖాముఖి.

నవతెలంగాణ: పేదలను ఆర్థికంగా ఎలా ఆదుకుంటున్నారు..?

సీఓ: పేదలను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేసేందుకు శ్రీనిధి, డాక్రా గ్రూప్ గ్రూపుల ద్వారా వారికి సాయం అంది ప్రోత్సహిస్తున్నాం.

నవతెలంగాణ: గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీలో ఎన్ని గ్రూపులు ఉన్నాయి..?

సీఓ: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 600 గ్రూపులు ఉండగా 560 యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. చేర్యాల మున్సిపాలిటీలో 302 డాక్రా గ్రూపులు ఉన్నాయి.

నవతెలంగాణ: ఏటా ఇంతవరకు టర్న్ ఓవర్ అవుతుంది..?

సీఓ: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 2024-25 ఏడాది గాను రూ.23 కోట్ల 90 లక్షల వరకు టర్నోవర్ లక్ష్యం ఉండగా ఇప్పటివరకు రూ.22 కోట్ల 50 లక్షల వరకు టర్నోవర్ చేసాం. ఇంద్రమ్మ మహిళా శక్తి గ్రూపులు 37 ఉండగా ప్రస్తుతం 60 యూనిట్ల వరకు వచ్చినట్లు వచ్చాయి.

నవతెలంగాణ: శ్రీనిధి, డాక్రా గ్రూపు ద్వారా ఎంతమందికి స్వల్పకాలిక రుణాలు ఇచ్చారు..?

సీఓ: శ్రీనిధి, డ్వాక్రా గ్రూపుల ద్వారా 2000 వేల మంది చిరు వ్యాపారులకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్వల్పకాలిక రుణం, చేర్యాలలో 800 మంది చిరు వ్యాపారులకు రుణం బ్యాంకుల ద్వారా అందించాం. వీటి ద్వారా చిన్న చిన్న వ్యాపారులతో చేసుకుంటున్నారు. శ్రీనిధి ద్వారా రెండు కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతుంది. దీని ద్వారా స్వయం ఉపాధి చాలా మందికి కలుగుతుంది.

నవతెలంగాణ: మహిళలకు ప్రోత్సాహం దక్కుతుందా..?

సీఓ: గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మహిళలకు ప్రోత్సహించేందుకు రూ. లక్ష నుంచి 5 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించి వారికి స్వయం ఉపాధి కల్పిస్తున్నాం. జ్యూట్ బ్యాగులు, ఫినాయిల్, అల్లం ఎల్లిగడ్డ, సారీ సెంటర్లు, కిరాణా షాపులు, తోపుడు బండ్లు, నడుపుకొంటూ బ్యాంకులకు నెల నెల డబ్బులు చెల్లిస్తున్నారు. దీంతో మహిళలకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

నవతెలంగాణ: గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీలో ఎంతమంది ఆర్పీలు ఉన్నారు..?

సీఓ: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 19 మంది ఆర్పీలు ఉన్నారు. చేర్యాల మున్సిపాలిటీలో 11 మంది ఉన్నారు. ఒక్కొక్క ఆర్పికి 15 నుంచి 30 వరకు గ్రూపుల బాధ్యత తీసుకొని ప్రోత్సహిస్తున్నారు.

నవతెలంగాణ: బ్యాంకుల ప్రోత్సాహం ఎలా ఉంది.?

సీఓ: మహిళా సంఘాలకు దాదాపు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పరిధిలో ఉన్న అన్ని బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. బ్యాంకుల సమయానికి గ్రూపులు రుణం, వడ్డీ చెల్లిస్తున్నారు.

మున్సిపల్ వార్డు అధికారుల పే స్కేళ్లను సవరించాలి

- పీఆర్సీ కమిషన్కు గ్రూప్-4 ద్వారా నియమితులైన వార్డు ఆఫీసర్ల విజ్ఞప్తి



నవతెలంగాణ-సిద్దిపేట

గ్రూప్ 4 ద్వారా నియామకమైన వార్డ్ ఆఫీసర్స్ తమ పే స్కేల్స్ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పీఆర్సీ కమిషన్‌కు ఉత్తరాల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో మున్సిపల్ వార్డ్ అధికారి అనే నూతన పోస్టును క్రియేట్ చేసి, జీవో ఎంఎస్ నంబర్ 109 (జులై200) ద్వారా గ్రూప్-4లో 1862ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. గ్రూప్-4 ద్వారా నియమితులయ్యారంటే జూనియర్ అసిస్టెంట్ కేడర్ ఉంటుందన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు గ్రూప్-4 ద్వారా నియాకం అయిన వార్డ్ అధికారులకి జూనియర్ అసిస్టెంట్ కి ఇస్తున్న పేస్కేల్ (రూ.24.250- రూ. 72,850) కాకుండా వార్డు ఆఫీసర్స్‌కి (22.240- 5. 67,300)ను ఇస్తున్నారని తెలిపారు. సమాన విద్యార్హతతో ఒకే నియామక పరీక్ష రాసి నియామకం అయినవారికి ఈ వ్యత్యాసం ఎందుకని వారు ప్రశ్నిస్తునారు. తమ సమస్యపై పీఆర్సీ కమిషన్‌కి రిజిష్టర్ పోస్ట్ ద్వారా ఉత్తరాలనూ పంపిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం చేయకుండా, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్‌లు మఠం శివానంద స్వామి, శ్రీకాంత్, సోహెల్, ప్రవీణ్, రాజు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, సీపీ



నవతెలంగాణ-సిద్దిపేట/ సిద్దిపేట అర్బన్

నీట్ యూజీ ఎగ్జామినేషన్ - 2025 ఎంట్రన్స్ పరీక్ష మే 4న జిల్లాలో మూడు సెంటర్లలో నిర్వహించడానికి మంగళవారం జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. అనురాధతో కలిసి జిల్లా కేంద్రంలో పలు విద్యాసంస్థలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ప్రతిభ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ హై స్కూల్, పొన్నాల శివారులోని ఇందుర్ కళాశాల, వికాస్ హై స్కూల్‌లను క్షేత్ర స్థాయిలో నేషనల్ టెస్టింగ్ కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నీట్ పరీక్ష కు కావలసిన సౌకర్యాల సదుపాయాలను పరిశీలించారు. ముఖ్యంగా సెంటర్ లో ఎలక్ట్రిసిటీ కనెక్షన్, అన్ని గదులకు సీసీ కెమెరా ఏర్పాటు, ఫర్నిచర్, పార్కింగ్ ఫెసిలిటీ, దివ్యంగా విద్యార్థుల కోసం ర్యాంపు ఇలా అన్ని సౌకర్యాలుతో కూడిన సెంటర్లను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. పరిశీలించిన అన్ని విద్యా సంస్థలలో డిస్టిక్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ మూడు సెంటర్లను ఎంపిక చేసి ఆ నివేదికను పై అధికారులకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీరి వెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ సుభాష్ చంద్రబోస్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కామారెడ్డి మారథాన్‌లో సిద్దిపేట వాసికి ద్వితీయ బహుమతి



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేటకు చెందిన 70 ఏండ్ల విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.నారాయణ రెడ్డి కామారెడ్డిలో హాఫ్ మారథాన్‌లో భాగంగా నిర్వహించిన 21 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొని ద్వితీయ బహుమతిని అందుకున్నారు. పద్మ పాణి సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో చైల్డ్ హుడ్ క్యాన్సర్ అవేర్నెస్ కోసం ఈనెల రెండవ తేదీన (గత ఆదివారం) కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో హాఫ్ మారథాన్‌ను నిర్వహించారు. దీంట్లో భాగంగా మూడు, అయిదు, పది, 21 కిలోమీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. ఈ పరుగు పందాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి రెండు వేల మంది పాల్గొన్నారు. ఈ పరుగు పందాల్లో 55 ఏళ్ల పై బడిన వారి కేటగిరీలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.నారాయణ రెడ్డి(70) పాల్గొన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసిన నారాయణరెడ్డి 2013లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటున్న నారాయణ రెడ్డి స్వగ్రామం సిద్దిపేట జిల్లాలోని ధూళ్మిట్ట మండల కేంద్రం.

బెంగాల్ విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను



నవతెలంగాణ-సిద్దిపేట

బెంగాల్ విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలకత్తా నగరంలో జాదవ్ పూర్ యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థి సంఘానికి ఎన్నికలు నిర్వహించి, విద్యార్థుల హక్కులను కాపాడాలని నిరసన తెలిపారని, ఈ క్రమంలో ఈ నెల 1న యూనివర్సిటీలో పర్యటించిన బెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసుకు నిరసన తెలపగా, తన కాన్వాయ్ ముందుకు పోనిచ్చారని, దాంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ టీఎంసీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని, విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు చేయాలని కుట్రతో వ్యవహరిస్తోందని అన్నారు. పోలీసు, పారా మిలటరీని ఉపయోగించి విద్యార్థులపై కేసులు నమోదు చేసి, క్యాంపస్‌లో భయానక పరిస్థితులను సృష్టిస్తున్నరని చెప్పారు. తక్షణమే ఈ ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించాలని, విద్యార్థి హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముత్యం, అక్షయ్, వినయ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

- 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను వెంటనే విడుదల చేయాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య
- కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-గజ్వేల్

కార్మికులందరికీ కనీస వేతనాలను రూ.26 వేలు నిర్ణయించాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలన్నింటినీ విడుదల చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ గజ్వేల్ ఇండస్ట్రియల్ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రవీందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతన జీవోల కాలం ముగిసి 15 ఏండ్లు అయినా వాటిని కొనసాగించడం జరుగుతుందని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీవన అవసరాలు పెరిగి రోజువారి, గృహ అవసరాలు విద్యా వైద్యం, ఇంటి అద్దెలు, ఖర్చులు పెరిగాయన్నారు.దీంతో కుటుంబ అవసరాలు తీరాకపోవడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోవడం జరుగుతుందన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ గుర్తింపు కార్డులు, బ్యాంకు ద్వారా వేతనాలు అమలు కావడంలేదని, యజమాన్యాలు కార్మికులందరినీ తీవ్రమైన శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. పరిశ్రమల్లో కనీస వసతులు మంచినీళ్లు, మరుగుదొడ్లు షఉస్, మాస్కులు, భద్రత సౌకర్యాలు కలిగించడం లేదని ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేదని, వేధింపులకు పాల్పడడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రత్యక్ష కార్యచరణ కు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, నాయకులు రాములు, జహంగీర్, అంజనేయులు, యాదగిరి, స్వామి, కనుకయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎఫ్ఎంజీఓ ఆఫీస్ జెనరల్ మేనేజర్ గామి



నవతెలంగాణ-సిద్దిపేట

యూనియన్ బ్యాంక్ అందిస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఆర్థికంగా ఎదగాలని ఎఫ్ఎంజి ఓ ఆఫీస్ జెనరల్ మేనేజర్ గామి సూచించారు. మంగళారం పట్టణంలోని విపంచి కళానిలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో రుణ సదుపాయాల కోసం యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం సిద్దిపేటలో 65 శాఖలు ఉన్నాయని, 23 శాఖలు సిద్దిపేట జిల్లాలో ఉన్నాయని తెలిపారు. యూనియన్ బ్యాంక్ వ్యాపార పారామితుల పరంగా 19 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌కు యూనియన్ ఎంఎస్ ఈ సపోర్ట్ వంటి వివిధ పథకాల క్రింద రుణాలను అందజేస్తోందని, ఇక్కడ తయారీ, సేవ, వ్యాపార కార్యకలాపాల కోసం రూ.50 వేల నుంచి రూ.500 లక్షలకు పైబడిన శ్రేణిలో అనుషంగిక ఉచిత రుణాలు మంజూరు చేయబడతాయని తెలిపారు. మరొక పథకం మహిళా పారిశ్రామికవేత్తల కోసం నారీ శక్తి స్కీమ్ ఉందని, ఇందులో అనేక రాయితీలు ఉన్నాయని అన్నారు. నిరుపేదలను ఆదుకోవడానికి బ్యాంక్ అనేక పథకాలను తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ వికాస్, ఎల్ డి ఎం హరి బాబు, డిప్యూటీ రీజినల్ హెడ్స్, స్థానిక బ్రాంచ్ మేనేజర్లు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ఎండిపోతున్న రైతుల పంటపొలాలకు నీళ్లు అందించాలి

- సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్



నవతెలంగాణ-కొమురవెల్లి

ఎండిపోతున్న రైతుల పంట పొలాలకు నీళ్లు అందించాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఐనాపూర్‌లో తేలు ఇస్తారి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ పక్క రైతుల వరి పొలాలు ఎండిపోతున్న పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున స్వామి ఆలయంలో పదవుల కోసం మల్లన్నకు ముడుపులు కట్టడాన్ని తప్పు పట్టారు. రైతులు ఆరుకాలం కష్టపడి నాట్లు వేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జనగామ డీసీసీ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవ చూపెట్టి దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా తపస్‌పల్లి రిజర్వాయర్ ను నింపి కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట ప్రాంతాల్లో ఉన్న చెరువు కుంటలను నింపి రైతుల పంట పొలాలు ఎండిపోకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాయకులు దాసరి ప్రశాంత్, నాయకులు కర్రోల్ల ఎల్లయ్య సున్నం యాదగిరి కనుగుల రాజు, దండు శంకర్, మల్యాల కనకయ్య , పాల్గొన్నారు

మంచి నీటి కొరత సమస్యను పరిష్కరించాలి

- ఆర్డీవోకు వినతి పత్రం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో మంచినీటి కొరత పరిష్కరించాలని సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ములుగు, వర్గల్, మర్కుక్, జగదేవ్‌పూర్, రాయపోల్, గజ్వేల్ పట్టణం పరిధిలో గత మూడు నెలల నుంచి నీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పట్టణం విస్తరణతో పాటు గ్రామాలలో జనాభా పెద్ద ఎత్తున పెరిగిందన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా లేక రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోజువారి గృహ అవసరాలకు, త్రాగడానికి నీరు లేకపోవడంతో రోజువారి విధులకు ఆటంకం జరుగుతుందన్నారు. పరీక్షా సమయంలో విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా వెళుతున్న పరిస్థితి ఉన్నదన్నారు. ఎండలు రాకముందే నీటి కొరత ఉంటే ప్రజల పరిస్థితి ఏమిటి అని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో మల్లన్న సాగర్ కొండ, పోచమ్మ ప్రాజెక్టులు ఉన్న మాత్పల్లిలో నూతనంగా పంప్ హౌస్ ప్రారంభించిన నీరు ఎక్కువ రావాల్సింది. పోయి నీటి కొరత ఎందుకొస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నీటి సమస్యను పరిష్కరించాలని లేనిచో ప్రత్యక్ష కార్యక్రమానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రంగారెడ్డి, హమ్మద్ ప్రవీణ్, రాజు, రాములు యాదగిరి, స్వామి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి



నవతెలంగాణ-తొగుట

కాండం తొలిచే పురుగు గమనించడానికి దీపపు ఎర సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలి. ఏఆర్ఎస్ తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి, శ్వేత, ఉమారాణి సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లాలో యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు అధైర్య పడకుండా పంటను మంచి యాజమాన్యం పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలన్న ఉద్దేశంతో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు, మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు తుక్కాపూర్ గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. కాండం తొలిచే పురుగు నివారణ పై రైతులు వేసిన వరి పంటను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఏఆర్ఎస్ తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి ఈ క్రింది సూచనలు పాటించాలని తెలియజేసారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్ష క బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టా సూచించారు. నారు నాటే వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే నారుమడికి 800 గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు, 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలని కోరారు. ఒకవేళ నారు మడిలో వేయకపోతే 15 రోజుల వయసున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో ఈత యాసంగిలో తప్ప కుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు, క్లోరంట్రానీలి ప్రోల్ 0.4జి నాలుగు కిలోలు వేయాలని తెలిపారు. వరి పొలంలో జింక్ పోషకాలలోపం, అధిక నాచు, చౌడు నివారణకు గమనించిన శాస్త్రవేత్తలు తదితర నివారణ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, ఏఈఓ రాజేష్, రైతులు తదితరులు ఉన్నారు.

పరిశ్రమలు పన్నులను చెల్లించాలి

- కమిషనర్ నరసయ్య



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న పరిశ్రమలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషన్ గోల్కొండ నర్సయ్య అన్నారు. మంగళవారం ఇంటి పన్నుల వసులో భాగంగా వివో బయోటెక్ సంబంధించిన బకాయిలు రూ.7 లక్షల 48 వేల 234 లను చెక్కు రూపంలో చెల్లించినట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ పరిధిలో ఉన్న మరిన్ని పరిశ్రమలు పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. ఇంటి పన్ను, నల్ల బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ డ్రైనేజీ క్లీనింగ్ డోర్ టు డోర్ కలెక్షన్ పరిశీలన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శానిటేషన్ జవాన్లకు పట్టణ ప్రజలు తడి పొడి చెత్తను వేరువేరు చేసి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భరద్వాజ్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

-డీఈవో శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-కొండపాక

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు సాధించాలని సిద్దిపేట డీఈవో ఎల్ఎంకె శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్ జరగదని తెలిపారు. ప్రణాళిక ప్రకారంగా విద్యార్థులు ప్రతిరోజు చదవాలని తెలిపారు. పరీక్షల కోసం విద్యార్థుల సన్నద్ధతను పరీక్షించారు. ఇప్పటివరకు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ప్రాక్టీసు పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న ఈవినింగ్ స్నాక్స్ రాగి జావాను పూర్తిగా వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇన్చార్జి టీచర్లు విద్యార్థులకు ఉదయం ఫోన్లు చేస్తున్న విషయాన్ని విద్యార్థుల ద్వారా తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. గది శుభ్రతను పరిశీలించారు. కొత్త పాత్రలను ఉపయోగించుటను గమనించారు. అత్యవసరమైతేనే సీ ఎల్ ఉపాధ్యాయులకు సూచించారు.ప్రధానోపాధ్యాయులు బైరయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

మోడల్ స్కూల్లో ఆరో తరగతికి దరఖాస్తు గడువు పెంపు

-ఈ నెల 10 వరకు తుదిగడువు

-ఎస్.బుచ్చిబాబు, ప్రిన్సిపాల్ మోడల్ స్కూల్ లచ్చపేట.



నవతెలంగాణ-దుబ్బాకం

ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు ఈనెల 10తో దరఖాస్తుల స్వీకరణకు తుదిగడువు ముగియనుంది. ఈ పరీక్షలు రాయడానికి ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రవేశం పొందగోరు విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. ఓపెన్ కేటగిరికి చెందిన విద్యార్థులు రూ.200 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు రూ.125 ఎంట్రన్స్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 13న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్షలు ఉంటాయి.

మాజీ ఎంపీటీసీ కనకలక్ష్మి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొమురవెల్లి

ఐనాపూర్ మాజీ ఎంపీటీసీ అత్యూరి కనక లక్ష్మి గుండెపోటుతో మరణించారు. మంగళవారం విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకుని పార్థివ దేహంపై బీఆర్ఎస్ పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కీర్తన కిషన్, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజేందర్, మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మానవ జన్మకు మహిళ పాత్ర గొప్పది

-రజక సంఘం ఉపాధ్యక్షులు రామ్ గారి శ్రీధర్

నవతెలంగాణ-గజ్వేల్



మానవ జన్మకు మహిళ పాత్ర గొప్పది మరేదీ లేదని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామ్ గారి శ్రీధర్ అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవంకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదన్నారు. మానవ జీవితంలో తల్లి, సతీమణి, సోదరి, కూతురుగా వివిధ పాత్రలో అందరి జీవితాలపై ప్రభావితం చేస్తుంద"న్నారు. స్త్రీ మూర్తి కున్న ఓపిక ఎవరికి ఉండదన్నారు. భూమికున్న ఓపిక మాతృమూర్తికి ఉంటుందన్నారు. సమాజాన్ని మేలుకొలుపుతుందని చెప్పారు.

విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, ఖమ్మం, నల్గొండ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిలి శ్రీపాల్ రెడ్డిని గెలిపించిన ప్రతి ఒక్కరికి పీఆర్టీ యూ మండల శాఖ అధ్యక్షులు కామిడీ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చల్ల కర్ణాకర్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచినందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. శ్రీపాల్ రెడ్డి, గెలుపు కోసం కృషిచేసిన మద్దూరు మండలంలోని ప్రతి కార్యకర్తకు, సహకరించిన సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మీనాజీపేట్ గ్రామంలో గత రెండు నెలల క్రితం లక్ష్మీ ఇంట్లో తూప్రాన్‌కి చెందిన సిరిగిరి నర్సింలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు దర్యాప్తు నిర్వహించి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసుకు సంబంధించిన తీర్పును అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక తీర్పును వెలువరించారు. నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష , రూ.1000 ల జరిమాన విధించారు. నిందితుడికి శిక్షపడేలా చేసిన గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి, పీపీ విజయ సుధ, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ లను పై అధికారులు అభినందించారు.

గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు.. బైక్ సీజ్

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని హనుమతండ, గ్రామానికి చెందిన ఇస్లావత్ రవి, అనే వ్యక్తి ఎనిమిది లీటర్ల గుడుంబా నాటు సారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు చేర్యాల ఎక్సైజ్ ఎస్సై సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని హనుమ తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ రవి, అనే వ్యక్తి తన ఫ్యాషన్ ప్లస్ బైక్ పై గుడుంబా నాటు సారాను తరలిస్తుండగా మద్దూరు, మండలంలోని వంగపల్లి, గ్రామంలో అతన్ని పట్టుకొని అరెస్టు చేసి అతని నుంచి 8 లీటర్ల గుడుంబా నాటసారని స్వాధీనం చేసుకొని పల్సర్ బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సువర్ణ , కానిస్టేబుల్ రవి, నర్సింలు, ప్రణీత్, సాయి, సంపత్‌లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

నవతెలంగాణ-దుబ్బాక


(ఫైల్)

అనారోగ్య సమస్యలు తాళలేక ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 9 వ వార్డులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు.. ఇదే వార్డుకి చెందిన ఐరేని యాదగిరి గౌడ్ (67) వ్యవసాయం చేస్తూ భార్య కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. కొంతకాలంగా ఆయన పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి వాంతులు చేసుకోగా, కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి, హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తు చేసిన నెలరోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాలి

మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి

నవతెలంగాణ- మెదక్



రైతులు దరఖాస్తు చేసిన నెలరోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాదులో జరిగిన విద్యుత్తు నియంత్రణ మండలి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, జాప్యం చేయవద్దన్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలిగాని, మరే ఇతర ప్రమాదం జరిగి రైతుగాని ఇంకెవరైనా చనిపోతే ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షలు కాకుండా, రూ.15 లక్షల వరకు పెంచి ఇవ్వాలన్నారు. విద్యుత్ మోటార్లకు, ఫీడర్‌కు ఎట్టి పరిస్థితులలో మీటర్లు పెట్టవద్దని కోరారు. మెదక్ జిల్లా కేంద్రంలో విద్యుత్ పరికరాలకు సంబంధించి ట్రాన్సార్మర్లు, కండక్టర్ వైరు, ఇతర పరికరాలు సంగారెడ్డిలో ఉండడం వల్ల మెదక్ వాసులకు చాలా ఇబ్బంది ఏర్పడుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే మెదక్‌లో నూతనంగా విద్యుత్ స్టోర్స్ ఆఫీసును నెలకొల్పాలని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

డెట్ స్వాపింగ్ పద్ధతిలో రుణ సౌకర్యం కల్పించాలి

- డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



దీర్ఘకాలిక రుణాలు నిరర్థకంగా (ఎన్పీఏలు)గా మారిన రైతులకు డెట్ స్వాపింగ్ పద్ధతిలో తిరిగి రుణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు వారిని ఆదేశించినట్లు డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కోర్ట్ కాంప్లెక్స్‌లో అగ్రికల్చర్ లోన్స్, రుణమాఫీ విషయంలో సిద్దిపేట జిల్లా బ్యాంకు మేనేజర్స్, అగ్రికల్చర్ డిపార్టుమెంటు, రైతు రక్షణ సమితి సభ్యులతో సమీక్షా సమేవాశం, లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకి ఎటువంటి సమస్యలు ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థని సంప్రదించాలని తెలిపారు. బ్యాంకు అధికారులని రైతులకు డెబిట్ స్వపింగ్ లోన్స్ కొరకు హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ వారి రుణాలని మాఫీ చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి రావు, ఏఈఓ బి. శ్రీకాంత్ రెడ్డి, రైతు సమాఖ్య సమితి అధ్యక్షులు ఎం. రామలింగ రెడ్డి, జిల్లా బ్యాంకు మేనేజర్స్, న్యాయసేవ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు అప్పుల నుండి రైతులకు ఉపశమనం

రైతులను ప్రైవేటు అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకర్లకు మార్గదర్శకాలు జారీ చేసిందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు అదనంగా మొదటి ప్రాధాన్యతతో దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రామలింగారెడ్డి, నాయకులు రాజేశం, శ్రీనివాస్, మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దేవయ్య, బాల నర్సు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనంను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సారంపల్లి వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



1970 నుంచి నేటి వరకు విద్యార్థి ఉద్యమం ఎస్ఎఫ్ఐలో పని చేసిన నాయకులు, కార్యకర్తల ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు ఈ నెల 23న షాహిద్ భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా హన్మకొండలోని కాళోజీ కళా క్షేత్రంలో నిర్వహించే సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సారంపెల్లి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం చేర్యాల డివిజన్ పరిధిలోని ఉమ్మడి చేర్యాల, ఉమ్మడి మద్దూరు మండలాల్లో పనిచేసిన పూర్వ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సన్నాహక సమావేశం శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వాసుదేవ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1970 నుండి 2025 వరకు విద్యార్థి రంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు దేశభక్తి యుత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎస్ఎఫ్ఐ కీలకపాత్ర పోషించిందన్నారు. అనంతరం ఈ నెల 23,న హన్మకొండ కాళోజీ కళా క్షేత్రం లో జరిగే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శులు గానుగుపాటి గంగాధర్, దొగ్గేల తిరుపతి, ఉమ్మడి జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కళా బృందంచే కనువిప్పు కార్యక్రమం

నవతెలంగాణ-నంగునూరు



పోలీసు కళా బృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే కార్యక్రమం సోమవారం రాత్రి రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాతా గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ పేట ఎస్సై ఆసీఫ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ అధికారులు ఎవరు కూడా నేరుగా ఫోన్ చేయరని అన్నారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.మూఢనమ్మకాలు,రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మంత్రాలు, తంత్రాలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళా బృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రాజేశ్, భాస్కర్, యాదగిరి, నర్సింలు, బాబు, మంజుల, రాజమణి, కన్నాలు నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, పోలీసుల దాడి

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్కుక్ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీసులు వెళ్లి రైడ్ చేయగా 05 వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో నలుగురు పారిపోయిన్నట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,590, 05 మొబైల్ ఫోన్లు 05, స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మర్కుక్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. పేకాట ఆడిన వారి వివరాలు పాపొల్ల బాలరాజ్ తండ్రి కిష్టయ్య, రంగా కృష్ణ తండ్రి నర్సింలు, బత్తుల నరేష్ తండ్రి నర్సింలు , మోర్సు రవీందర్ రెడ్డి తండ్రి గోపాల్ రెడ్డి వీరందరి నివాసం మర్కుక్, పారిపోయిన వారి వివరాలు ఎర్రగుంట ప్రవీణ్ తండ్రి యాదగిరి, నివాసం మర్కుక్, బయ్యారి రాంసింగ్, నివాసం గంగాపూర్, అన్నారం నాగిరెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి, నివాసం మర్కుక్, నిరుడి నాగరాజు తండ్రి నర్సింలు, నివాసం మర్కుక్ ,అచ్చమ్మ గారి పాండురంగం తండ్రి బిక్షపతి, నివాసం మర్కుక్. టాస్క్ ఫోర్స్ అధికారులు, మర్కుక్ పోలీసులు మాట్లాడుతూ.. గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్లల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమా లు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

మాజీ ఎంపీటీసీ కనకలక్ష్మికి సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ కొమురవెల్లి



ఐనాపూర్ మాజీ ఎంపీటీసీ అత్యూరి కనక లక్ష్మి గుండెపోటుతో మరణించడంతో మంగళవారం సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి నివాళులు అర్పించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి పార్థివ దేహానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, కానుగుల రాజు, కర్రోళ్ల ఎల్లయ్య, సున్నం యాదగిరి, దండు శంకర్, దయ్యాల అనిల్, పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఎంఏఓ

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం పరిధిలో గల పొన్నాల గ్రామంలోని పయ్యావుల రాజు నీటి ఎద్దడికిలోనై వడలిపోతున్న వరి పైరును పరిశీలించి రైతుకు సూచనలు ఇచ్చారు. వేసవిలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని సాగుచేసుకోవాలని వీలైనంతవరకు ఆరుతడిపంటలు సాగుచేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న , పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి యాసంగి పంటలుసాగు చేసుకోడం ద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించడమే కాకుండా పంట మార్పిడి చేసినట్టు ఉంటుందని, తద్వారా నేలలో పోషకాల లభ్యత పెరగడం చీడ పీడలు తగ్గడంతో పాటు వరిసాగుకంటే మంచి లాభాలు గడించడం జరుగుతుందని అంతే కాకుండా యాసంగిలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను కూడా అదిగమించగలరని సూచించారు. కావున రైతులు యాసంగిలో వారికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలని తెలిపారు.



పొద్దుతిరుగుడు పంటపై మెలకువలు పాటించాలి

- వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా.ఎస్.శ్రీదేవి

నవతెలంగాణ-తొగుట



ప్రొద్దుతిరుగుడులో బోరాక్స్‌ను 400 గ్రా॥ ఎకరాకి పిచికారి చేయడం వల్ల తాలు గింజలు శాతం తగ్గి, పూర్తిగా గింజ కట్టడం ఏర్పడి అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా.ఎస్. శ్రీదేవి అన్నారు. సోమవారం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరు వాక కేంద్రం, తోర్నాల ఆధ్వర్యంలో "ప్రొద్దు తిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం" నిర్వహించారు. ప్రొద్దు తిరుగుడులో డ్రోన్‌తో బోరాక్స్ పిచికారిపై పద్ధతి తుక్కపూర్ గ్రామం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రొద్దుతిరుగుడులో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాలు అవసరం చాలా ఉందన్నారు. ప్రస్తుత కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ పాత్రని వివరించారు. డ్రోన్లను ఉపయోగించి పిచికారి చేసిన యెడల కూలీల కొరతను, సమయం ఆదా అవుతుంది. తరువాత డా. డి. శ్వేత, శాస్త్రవేత్త (ఆగ్రో), వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల పంటల వైవిధ్యీకరణలో నూనెగింజల పాత్ర, ప్రొద్దుతిరుగుడులో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. చివరిలో రైతులు పొలాలను సందర్శించి ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనలో భాగంగా ప్రొద్దుతిరుగుడు పంటలో డ్రోన్ తో బోరాక్స్ పిచికారి పై పద్ధతి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రైతు సోదరులు డ్రోన్ వినియోగంలో వారి సందేహాలను శాస్త్రవేత్తలని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తోర్నాల శాస్త్రవేత్తలు డా. ఈ. ఉమారాణి, శ్రీ. జె. విజయ్, డా. పల్లవి, శ్రీ. మోహన్, వ్యవసాయ అధికారి, శ్రీ.రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి, రైతు సోదరులు పాల్గొన్నారు.

జర్నలిస్టలపై అక్రమ కేసులు పెట్టించడం కొమ్మూరికి తగదు

- అక్రమ కేసులు బనాయించడం కొమ్మూరికి ఆనవాయితీగా మారింది
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి


నవతెలంగాణ-చేర్యాల



జర్నలిస్టలను తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో అక్రమ కేసులు పెట్టించి పోలీస్ అధికారులతో బెదిరించడం జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి తగదని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులపై రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం ఉందనే అహంతో చేర్యాల సీఐని పోలీస్ యంత్రాగాన్ని ఉపయోగించుకొని అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. చేర్యాల పోలీసు యంత్రాంగం, అధికార పార్టీ నాయకులకు తొత్తు పలుకడం సమాజసం కాదని పేర్కొన్నారు. ఇటీవల చేర్యాల ప్రాంతానికి చెందిన జర్నలిస్టు గణేష్ తివారిపై అక్రమ కేసు పెట్టించే ప్రయత్నమే కాకుండా పోలీసు అధికారులచే గణేష్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అతనికి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పిటిషన్ దారుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే జర్నలిస్టులపై కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అక్రమ కేసులు బనాయించడం ఆనవాయితీగా మారిందని, వాటన్నిటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జర్నలిస్టలను ఇబ్బందులకు గురిచేస్తే తమ పార్టీ మద్దతు తెలియజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో,చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, ప్రశాంత్, రజింత్,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-సిద్ధిపేట



ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షా సమయం కాగా, 5 నిమిషాల ఆలస్యంతో కూడా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా డిఐఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 43 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరానికి చెందిన 20595 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 7161 మంది, ఒకేషనల్ విభాగంలో 2619 మంది, మొత్తంగా 9780 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 8243 మంది, ఒకేషనల్ విభాగంలో 2572 మంది, మొత్తంగా 10,815 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే తమ సెంటర్‌కు చేరుకోవాలని, చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు సెంటర్లోకి తీసుకురావద్దని విద్యార్థులకు సూచించారు. సెంటర్లో వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక డంపుపై టాస్కోర్స్ పోలీసుల కొరడా

- అక్రమంగా డంపు చేసిన 30 టన్నుల ఇసుక పట్టివేత

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో రేగులపల్లి పద్మా రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద నిందితుడు దండుగుల కనకయ్య తండ్రి మల్లయ్య అతను ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండ అక్రమంగా ఇసుక డంపు చేసినారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, త్రీ టౌన్ పోలీసులు వెళ్లి రైడ్ చేసి ఇసుక డంపులను, స్వాధీనపరుచుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్, మొరము, మట్టి అక్రమ రవాణా చేసిన, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667445 ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

- దూల్మిట్ట తహసీల్దార్ మధుసూదన్

నవతెలంగాణ-మద్దూరు



ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మధుసూదన్, హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం జాలపల్లి, గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మంద రాజుకు చెందిన టీఎస్ 36 ఎల్ 8057 ట్రాక్టర్‌ను పట్టుకొని రూ.15 వేల జరిమానా విధించినట్లు తెలిపారు .ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు శిక్ష, జరిమానాలు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో రంగాధంపల్లి చౌరస్తా, పొన్నాల ఎక్స్ రోడ్, దుద్దెడ టోల్ గేట్ , రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా 10 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా మంగళవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 10 మందికి రూ. 9వేలు జరిమాన విధిం చారు. ఒక వ్యక్తికి 12 రోజుల జైలు శిక్ష విధించారు.



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. మంగళవారం మద్యం తాగి వాహ నాలు నడిపిన 12మందికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ.. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి, రూ.13 వేల 400 వందల వజరిమాన విధించామన్నారు. 12 మంది వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్‌తో నిర్ధారణ చేశావ న్నారు. విచారణ చేసి 12మందికి రూ.13వేల400 వందలు జరిమాన విధించాం "న్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ

మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై పి.అభిలాష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని హుస్నాబాద్ కోర్టులో హాజరు చేయగా అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.కృష్ణతేజ జరిమానా వేసినట్లు తెలిపారు. కాగా బోనాల సురేష్ (28), గట్టు బాబు (35), చెప్యాల సంపత్ (38) ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష, తొమ్మిది మందికి జరిమానా విధించార న్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదానికి గురైతే కుటుంబం రోడ్డున పడుతుం దన్నారు. మైనర్‌లు వాహనాలు నడిపితే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కోర్టు కానిస్టేబుల్ సంజీవ్, కానిస్టేబుల్‌లు, తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన నాళపల్లి పెంటయ్య (86) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. దామరకుంట కాంగ్రెస్ గ్రామ శాఖ తరుపున నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ మర్కుక్ మండలాద్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి రూ.4 వేలు, మాజీ జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్ రూ.3 వేలు, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి రూ.2 వేల ఆర్థిక సాయం ఇవ్వగా దామరకుంట మాజీ సర్పంచ్ గాయిత్రి బాలనర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ పత్తి అంజయ్యలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.చంద్రం గౌడ్, తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన నాళపల్లి పెంటయ్య (86) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యాక్షులు రాజబోయిన కొమ్మురయ్య యాదవ్, బీజేపీ దామరకుంట గ్రామాధ్యక్షులు రాజబోయిన నర్సింలు యాదవ్‌లు భాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.8.500లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులున్నారు.

మల్క కొమురయ్య గెలుపుతో సంబరాలు



నవతెలంగాణ-సిద్ధిపేట

కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి కొమరయ్య గెలుపొందడంతో బీజేపీ జైత్రయాత్ర మొదలైందని సిద్ధిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు శంకర్ అన్నారు. కొమురయ్య గెలుపొందడంతో సిద్ధిపేట జిల్లా కేంద్రంలో టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకొని బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయంకు కృషి చేసిన బీజేపీ కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహెూత్సవం





నవతెలంగాణ-వర్గల్

వర్గల్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగుతుండగా, మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహాముని కళ్యాణ మహెూ త్సవం అత్యంత వైభవంగా జరి గింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికపై అధిష్టింపజేశారు. అనంత రం రెండు గంటల పాటు జరిగిన కళ్యాణ మహెూ త్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కాగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాళ్ల ప్రభుదాస్ గౌడ్, మక్తాల యాదగిరి గౌడ్, గజ్వేల్ బాల్ కిషన్ గౌడ్, కొండల్ గౌడ్, మహేందర్ గౌడ్, జహంగీర్ గౌడ్, తౌటి కిష్టయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

రేణుక ఎల్లమ్మ దయతో మండల ప్రజలందరూ పాడిపంటలతో సుఖ సంతోషంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలం తిరుమలపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహెూత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కుటుంబ సమేతంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బండారు దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు సత్తయ్య, గడ్డం నాగరాజు,రమేష్ గౌడ్, లక్ష్మి నారాయణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంకు విరాళం అందజేత



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

పెద్దమ్మ తల్లి దీవెన ప్రజలం దరిపై ఉండాలని ప్రముఖ వ్యాపారవేత వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దాలిం గారెడ్డి పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి 5వ వార్షికోత్సవ మహెూత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు గ్రామ ముదిరాజ్ కులస్తులు డప్పు లు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం చేకూర్చాలని ఆ తల్లి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్టు తెలిపారు. పెద్దమ్మతల్లి వార్షికో త్సవం కు రూ.30వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు సత్య నారాయణ,కనకయ్య, ఎల్లం,చంద్రం,తిరుపతి, లక్ష్మిన ర్స్, భాస్కర్, రామస్వామి, బోయిని ప్రవీణ్, శ్యాం నాగరా జు, రాకేష్, సాయి, శ్రవణ్, ధర్మ, పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆర్ రావాలి

- బీఆర్ఎస్ నాయకులు బీవీ రావు



నవతెలంగాణ-గజ్వేల్

ఏడాది కాలంలోనే రాష్ట్రం అధోగతి పట్టిందని తిరిగి కేసీఆర్ రావాలని బీఆర్ఎస్ గజ్వేల్ నాయకులు బి. వెంకటేశ్వర్రావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజలు తప్పు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధికి రూ.177 కోట్లు మంజూరు చెయ్యగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని రద్దు చేసిందన్నారు. దీంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్, నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. రాష్ట్రం, గజ్వేల్ అభివృద్ధి చెందాలంటే తిరిగి కేసీఆర్ రాష్ట్రానికి నాయకత్వం వహించవలసిందేనని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో మట్టి రోడ్లు ఉన్నాయని వాటిని సీసీ రోడ్లుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవతెలంగాణ-రాయపోల్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే ఇంటర్మీడియట్ విద్యార్థిని, విద్యార్థులకు ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, మహమ్మద్ సుల్తాన ఉమర్ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మీరు సంవత్సరం మొత్తం కష్టపడి చదివిన సబ్జెక్టులు ఇష్టంతో పరీక్షలలో రాసి అందరు మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

తపస్ బలపర్చిన కొమురయ్య విజయం పట్ల హర్షం



నవతెలంగాణ-నంగునూరు

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడం పట్ల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల శాఖ హర్షం వ్యక్తం చేశారు. నంగునూరు మండల కేంద్రంలో వివేకానందుని విగ్రహానికి పుష్పమాల అలంకరించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల శాఖ అధ్యక్షులు పయ్యావుల జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల్లో బలంగా ఉండడం వలన ఎన్నికల్లో విజయం సాధ్యమైందని అన్నారు. నంగునూరు మండల ప్రధాన కార్యదర్శి ముంద్రాతి రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట డివిజన్ ఇన్చార్జి అనుముల వీరేశం, జిల్లా కార్యదర్శి కత్తుల రాంరెడ్డి, వీరారెడ్డి, పర్శరాములు ,గోవర్ధన్, తిరుపతి, సతీష్, వెంకటేశం శ్రీనివాసరెడ్డి, కైలాసం వెంకటేశం లక్ష్మీ నరసయ్య, మన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలకు పూజలు



నవతెలంగాణ-సిద్ధిపేట

చిన్నకోడూరు మండల పరిధిలోని రంగాయి పల్లి చెరువులోకి వస్తున్న కాలేశ్వరం గోదావరి జిల్లాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కాలేశ్వరం ప్రాజెక్టు మూలంగానే తమ గ్రామానికి గోదావరి నీళ్లు వచ్చాయని, కేసీఆర్, హరీశ్ రావులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రంగాయ్ పల్లి, విఠలాపూర్, కొత్త పల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలంలోని ఆరేపల్లి(ఎస్‌బీ) ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి వారి సహ విద్యార్థులకు పాఠాలు బోధించడం, బోధనలో వారి అనుభవాలను పంచుకోవడం జరిగింది. ఎండి తస్వీర్ ప్రధానోపాధ్యాయురాలిగా వైష్ణవి, నందిత ,ఆసియా ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సురేష్ మాట్లాడుతూ.. ద్యార్థులందరూ భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయిలో ఎదుగుతూ తల్లిదండ్రులను ,ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తిగుళ్ళ లింగం గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పునప్రతిష్ట మహెూత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-నంగునూరు

పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాముల పున ప్రతిష్ట మహెూత్సవ ఆహ్వాన పత్రికను ప్రముఖ పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్ రెడ్డికి మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు అందించారు. గ్రామంలో ఈ నెల 6 నుంచి 10 వరకు జరిగే శ్రీ అభయాంజనేయ స్వామి నవగ్రహ శివ పంచాయతన, ధ్వజస్తంభ, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహములు పున్న ప్రతిష్ట మహెూత్సవ రావాల్సిందిగా వంగ రాజేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేకుల పల్లి సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు గోవిందారం రవి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రంగు రాజు,యాదవ సంఘం అధ్యక్షులు నక్క రాజయ్య, బాల మల్లు, సురేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.